**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న **'జర్నలిస్ట్ ఫైల్'** దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
**9502535152, 7416812467**



బుధవారం 05.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 | సంచిక -131 | www.journalistfile.com | పేజీలు 6 | వెల : రూ.5.00





**175 / 175**

| PARTY | WON |
|---|---|
| TDP | 135 |
| JSP | 21 |
| BJP | 8 |
| YCP | 11 |

**ఏపీ లోక్‌సభ**

| PARTY | WON |
|---|---|
| TDP | 16 |
| JSP | 2 |
| BJP | 3 |
| YCP | 4 |

**తెలంగాణ లోక్ సభ (17)**

| పార్టీ | ఆధిక్యం | గెలుపు | మొత్తం |
|---|---|---|---|
| కాంగ్రెస్ | 0 | 8 | 8 |
| బీజేపీ | 0 | 8 | 8 |
| బీఆర్ఎస్ | 0 | 0 | 0 |
| ఇతరులు | 0 | 1 | 1 |

- ఐదేళ్ల తర్వాత తెలుగు గడ్డపై, మళ్లీ పసుపు పతాక రెపరెప
- కూటమి సునామీలో అడ్రస్ లేకుండా పోయిన వైసీపీ
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జన నీరాజనం
- 135 స్థానాల్లో టీడీపీ సూపర్ విక్టరీ
- 21 కి 21 స్థానాల్లో జనసేన ఘన విజయం
- 8 చోట్ల కమల వికాసం
- మొత్తం 164 స్థానాల్లో కూటమికి విజయం
- 8 ఉమ్మడి జిల్లాలో కనుమరుగైన వైసీపీ
- కడపలోనూ కూటమిదే ఆధిక్యం
- ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలుగుదేశం, జనసేన, బీజేపీమూడు పార్టీల కూటమి కలిసికట్టుగా వైసీపీని మట్టికరిపించింది. పసుపు పెనుగాలి ధాటికి వైసీపీ రెక్కలు తెగిన ఫ్యానుగా మారింది. అక్కడా ఇక్కడా అని లేకుండా అన్ని ప్రాంతాలను కొల్లగొట్టింది. వాళ్లూ వీళ్లూ అని లేకుండా మంత్రులందరినీ ఇంటి దారి పట్టించి అప్రతిహతంగా దూసుకెళ్లిన కూటమి. "ఉత్తరాంధ్ర.. ఊపేసింది.. గోదారి పొంగి పొర్లింది. కృష్ణా-గుంటూరు పోటెత్తింది. ప్రకాశం నెల్లూరులోనూ జోరు కొనసాగింది. సీమ కోటను బద్దలు కొట్టింది. మొత్తం మీద ఒక్క కడప మినహా ఏ జిల్లాలోనూ కూటమి ప్రభంజనానికి తిరుగే లేకుండా పోయింది." మూడు పార్టీలు.. కూటమి కట్టి.. కలిసికట్టుగా వైసీపీ కోటను బద్దలుగొట్టాయి. కూటమి సునామీకి పాతిక మంది మంత్రుల్లో23 మంది అడ్రెస్ గల్లంతైంది. ఐదేళ్ల కిందట ఎంతటి ఘనమైన విజయమో.. ఇప్పుడు అంత ఘోర పరాజయం.

తెలుగుదేశం, జనసేన, బిజెపితో కూడిన మహాకూటమి దాటికి అధికార వైఎస్సార్సీ తట్టుకోలేక పోయింది. ఈ ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 10 సీట్లు మాత్రమే వైఎస్సార్సీ గెలుచుకుంది. 21 స్థానాలకు పోటీ చేసిన జనసేన పార్టీ నూటికి నూరుశాతం ఫలితాలను సాధించింది. 148 స్థానాలకు పోటీ చేసిన టిడిపి 138 సీట్లు గెలుచుకుంది. భారతీయ జనత పార్టీ 4 స్థానాలు గెలుచుకుంది. రాష్ట్ర శాసనభలో 88 స్థానాలు సాధిస్తే అధికారాన్ని చేక్కించుకుంది. ఈ ఫలితాలు తనకు ఆశ్చర్యం కలిగించినట్లు సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. టిడిపి నేత చంద్రబాబు కుప్పంలోను, పవన్ కల్యాణ్ పిఠాపురంలోను, నారా లోకేష్లు ఎంఎల్ఎలు అఖండ విజయం సాధించారు. గత అయిదేళ్లుగా స్వపక్షంలో ఉండి విపక్షంగా వ్యవహరించిన కనుమూరి రఘురామకృష్ణంరాజు ఉండిలో తెలుగుదేశం అభ్యర్థిగా అఖండ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఎనిమిది జిల్లాల్లో అధికార వైసీపీ అసలు ఖాతా తెరవలేకపోయింది.

ఆ జిల్లాల్లో ఒక్క అసెంబ్లీ సీటు కుడా గెలవలేకపోయింది. శ్రీకాకుళం,విజయనగరం,తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో ఫ్యాన్ పార్టీ గల్లంతయింది. ఆ ఎనిమిది జిల్లాల్లో కూటమి స్వీప్ చేసింది, కూటమి ప్రభంజనం ముందు వైకాంగ్రెస్ నిలువలేని పరిస్థితి. కూటమి జోరుకు రాష్ట్రంలో వైకాంగ్రెస్ కంచుకోటలు కుప్పకూలిపో యాయి. ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాల్లో కూడా కాంగ్రెస్ ఓటమి పాలయింది. జగన్ సొంత జిల్లా కడపలో పది అసెంబ్లీ సీట్లుకుగాను వైకాంగ్రెస్ పార్టీ కేవలం మూడు సీట్లులోనే ఉనికి చాటుకుంది. ఇది వైకాంగ్రెస్కు తీరని షాక్ మారింది. ఇక ఎన్నికల్లో వైకాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రుల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తప్పించి.. మంత్రులు అంతాఓటమి పాలయ్యారు. మంత్రులు ధర్మాన, సీదిరి అప్పలరాజు, బొత్స సత్యనారా యణ, రాజన్నదొర అమర్ నాథ్, విశ్వరూప్. దాడిశెట్టి రాజా, తానేటతి వనిత, విడుదల రజనీ, కారుమూరు నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, జోగి రమేష్, మెరుగు


2 లో


## కన్నీళ్లు ఆపుకుంటూ..

# జగన్ భావోద్వేగం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఘోర ఓటమిపై సీఎం జగన్ మీడియాతో మాట్లాడుతూ.. భావోద్వేగానికి గురయ్యారు. ఘోర ఓటమిపాలయినందుకు ఆయన మాటల్లో కాస్త తడబాటు కనపడింది. కన్నీళ్లు ఆపుకుంటూ మాట్లాడారు. ఆయన కళ్లలో నీళ్లు వచ్చినట్లు కనపడింది.

తాను ఎన్నో కష్టాలను కూడా అనుభవించానని వైఎస్ జగన్ తెలిపారు. తనను ఇకపై ఎన్ని కష్టాలు పెట్టినా ఎదుర్కొంటానని చెప్పారు. వైసీపీ ఇచ్చిన మాట తప్పకుండా పేదలకు అండగా నిలబడిందని జగన్ తెలిపారు.

**ఏమన్నారు?**

ఎవరు మోసం చేశారో.. ఎక్కడ అన్యాయం జరిగిందో తెలియదు. జరిగిన దానికి ఆధారాలు లేవు కనుక ఏమీ చెయ్యలేము. పోరాటాలు, కష్టాలు నాకు, మా పార్టీకి కొత్త కాదు. నా రాజకీయ జీవితం మొత్తం పోరాటాలు కష్టాలే. మళ్లీ పోరాటం చేస్తాం. గతంలో మ్యానిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారు

మేము ప్రతి ఒక్కరికీ మంచి చేసినా ఓటమి పాలయ్యాం. గతంలో ఎప్పుడూ జరగనంత మేలు చేశాం. మహిళలకు సంక్షేమ పథకాలు అందించాం. మంచి చేసినా ఓటమిపాలయ్యాం అని వైఎస్ జగన్ అన్నారు. మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఫలితాలు ఆశ్చర్యంగా వున్నాయి. 53 లక్షల మందికి అమ్మఒడి అందించాం. కోటీ ఐదు లక్షల అక్కచెల్లెమ్మల ప్రేమాభినాలు ఏమయ్యాయో తెలియదు. అరకోటి మంది రైతుల ప్రేమ ఏమైందో తెలియదు. అవినీతి లేకుండా 2లక్షల 70వేల కోట్లను డిబిటి ద్వారా నేరుగా ప్రజలకు అందించాం. మేనిఫెస్టోని 99శాతం అమలు చేశాం. పెత్తందార్లతో పోరాడి ఇంగ్లీష్ మీడియం చదువులు తీసుకొచ్చాం. రైతున్నతోడుగా రైతు భరోసా ఇచ్చాం. అన్ని వర్గాలనూ అభివృద్ధి చేయాలని చూశాను. అందుకే గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశాం. వారి రుణానుబంధం, ఆప్యాయత ఏమైందో తెలియదు అన్నారు.

ఎన్నో పోరాటాలు చేశాను. ఎవరూ అనుభవించని రాజకీయ కష్టాలు ఎదుర్కొన్నాను. నా ప్రతి కష్టంలో తోడుగా వున్న నాయకుడికి, కార్యకర్తకు ధన్యవాదాలు అన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తాం. ఎంత చేసిన ఏం చేసినా 40శాతం ఓటు బ్యాంకును తగ్గించలేకపోయారు. ప్రతిపక్షంలో వుండటం కొత్తకాదు, పోరాటం కొత్త కాదు. ఎన్నికష్టాలు వచ్చినా ఎదుర్కోడానికి సిద్ధంగా వున్నాం. పోరాడి పైకిలేస్తాం. ప్రజలకోసం ఎప్పుడు మా పార్టీ పోరాడుతుంది అని జగన్ పేర్కొన్నారు.

# ముద్రగడ 'పేరు' మార్చుకుంటాడా ?



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఈ ఎన్నికల్లో పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడించి ఇంటికి పంపుతాం. ఒకవేళ ఓడించి పంపకపోతే తన పేరు ముద్రగడ పద్మనాభం కాదు పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని' కొన్నాళ్ల క్రితం కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సవాల్ విసిరారు. "మేం మీ బానిసలమా మీకు ఓటేయడానికి ? పవన్ సమస్యలు, పద్ధతులు తెలుసుకుని మాట్లాడాలి. నోరుంది, ముఖానికి రంగుందని ఏది పడితే అది మాట్లాడితే చెల్లదు. పిఠాపురం నుంచి త్వరలో పవన్ ను తన్ని తరిమేస్తారు" అని అన్నారు .

ముద్రగడ సవాల్ నేపథ్యంలో ఈ రోజు వెల్లడైన ఫలితాలలో పిఠాపురంలో మరో రౌండ్ లెక్కింపు మిగిలి ఉండగా జనసేన అధినేత పవన్ కళ్యాన్ 67843 ఓట్ల ఆధిక్యంలో ఘన విజయం దిశగా ముందుకు సాగుతున్నాడు. పవన్ కు పోటీగా ఇక్కడ పవన్ సామాజికవర్గానికే చెందిన కాకినాడ ఎంపీ వంగా గీతను పోటీకి దింపారు. ఇక్కడ ఉన్న 75 వేల కాపు ఓట్లను చీల్చడం లక్ష్యం పెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వంగా గీతను గెలిపిస్తే ఉప ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించారు. అయితే ఇక్కడ పవన్ గ్లామర్ ముందు జగన్ అఫర్ పనిచేయలేదు. పవన్ గెలుపు కోసం జబర్దస్త్ నటులతో పాటు, మెగా కుటుంబం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. పవన్ గెలుపు నేపథ్యంలో ముద్రగడ స్పందన కోసం అందరూ ఎదురు చూస్తున్నారు.

# ఘన విజయంతో చరిత్ర సృష్టించిన లోకేష్

- మంగళగిరిలో విజయఢంకా మోగించిన లోకేశ్
- ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు
- టీడీపీ కేవలం రెండుసార్లు మాత్రమే గెలిచిన వైనం
- 1985లో టీడీపీ చివరిగా విజయం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. మంగళగిరిలో 41 వేల ఓట్ల భారీ మెజార్టీతో విజయఢంకా మోగించారు. సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి లావణ్యపై గెలిచారు. దీంతో టీడీపీ దశాబ్దాలుగా గెలవని మంగళగిరి అసెంబ్లీ స్థానంలో ఆ పార్టీ జెండా ఎగరేసి చరిత్ర సృష్టించారు. ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరిగితే టీడీపీ కేవలం రెండుసార్లు మాత్రమే గెలిచింది. 1985లో చివరిగా గెలిచింది. ఆ తర్వాత ఇప్పటివరకూ అక్కడ గెలవలేదు.

ఇక 2019లో లోకేశ్ పోటీ చేసి ఓడినా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉండటం ఇప్పుడు ఆయనకు కలిసొచ్చింది. అలాగే నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆయనపై ప్రజల్లో సానుకూలతను పెంచాయనడంలో ఎలాంటి సందేహం లేదు. గత ఐదేళ్లుగా నారా లోకేష్ ఎన్నో రకాల విమర్శలను ఎదుర్కొంటూ వస్తున్నారు. మంగళగిరిలో ఓటమి పాలయ్యారంటూ వైసీపీ నేతలు ఆయనను ఎన్నో విధాలుగా అవమానించారు. వాటన్నింటికీ నారా లోకేష్ తన విజయంతో సమాధానం చెప్పారు. తానేమీ తన కంచుకోట నుంచి పోటీ చేయడం లేదని.. టీడీపీ వీక్‌గా ఉన్న స్థానం నుంచి పోటీ చేశానని.. తిరిగి అదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని లోకేష్ పలుమార్లు చెప్పారు. ఇప్పుడు ఆయన విజయం వైసీపీకి చెంపపెట్టు అని చెప్పాలి.



# కూటమి ప్రభంజనంలో 'పవన్' కీలకపాత్ర

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాతో చలన చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టిన పవన్ కళ్యాణ్.. ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగాడు. హిట్ ఫ్లాప్ లతో సంబంధం లేకుండా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. అందరి హీరోలకు అభిమానులుంటారు. అన్న మెగా స్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువనేతగా రాజకీయంలో అడుగు పెట్టాడు. రాజకీయంగా అన్నతో విబేధించి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన పవన్ కళ్యాణ్ అనూహ్యంగా జనసేన పార్టీని స్థాపించాడు. అయితే 2014 లో నవ్యాంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్డీయే కూటమికి బేషరత్తుగా తన మద్దతు ప్రకటించాడు. ప్రభుత్వం పని తీరు నచ్చక పోతే నేను ప్రశ్నిస్తా అని అన్న జనసేనాని.. అప్పటి నుంచి అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా తనకు అన్యాయం అన్న విషయంపై, ప్రభుత్వంలో జరిగే అవకతవకలపై తన గళం వినిపిస్తూనే ఉన్నాడు.

2019లో జరిగిన ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి వెళ్ళిన పవన్ కళ్యాణ్ ఘోర పరాజయాన్ని పొందాడు. తాను పోటీ చేసిన విశాఖ, భీమవరం నుంచి మాత్రమే కాదు.. ఒక్క రాజోలు నియోజక వర్గం ఎమ్మెల్యే రాపాక మినహా మిగిలిన జనసేన అభ్యర్థులు కూడా ఓటమి పాలయ్యారు. అప్పుడు సర్వత్రా విమర్శలను ఎదుర్కొన్నాడు.

వైసిపీ ప్రభుత్వం, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీరుపై సునిసిత విమర్శలు చేస్తూ.. ప్రజలు కష్టాల్లో తానున్నాను అంటూ భరోసాగా నిలిచాడు. అన్నదాతలకు మాత్రమే కాదు చేనేత కార్మికులకు.. ఇలా బాధితులకు అండగా నిలిచాడు. తన సొంత డబ్బులకు బాధిత కుటుంబాలకు ఇచ్చి అండగా నిలిచాడు. అంతేకాదు.. ఏపీలో ఎన్నికల సమయం దగ్గర పడుతుండగా వైసిపీకి చెక్ పెట్టె విధంగా రాజకీయ చతురతను చాటుకున్నాడు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్న సమయంలో పరామర్శకు వెళ్ళిన పవన్ హటాత్తుగా మీడియా ముందుకు వచ్చి ఎన్నికల్లో టిడిపీ, జనసేన కలిసి పోటీ చేస్తుంది అని ప్రకటించాడు.

అంతేకాదు.. ఏపీ ప్రజల ప్రయోజనం కోసం తనని తానూ తగ్గించుకుని మరీ తక్కువ సీట్లతోనే పోటీకి వెళ్ళడమే కాదు.. బీజేపీని కూడా కూటమితో కలిసి నడిచేలా చేయడంలో పవన్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే.. పిఠాపురం నుంచి బరిలోకి దిగిన పవన్ కళ్యాణ్ ను ఓడించడం కోసం అధికార వైసిపీ ప్రభుత్వం రాజకీయ ఉద్దండులను రంగంలోకి దింపింది. స్వయంగా సిఎం జగన్ .. వైసిపీ అభ్యర్థి వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సిఎం పదవిని ఇస్తానని ప్రకటించారు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ గెలుపు నల్లేరు మీద నడకలా సాగింది. పవన్ మీద అభిమానంతో మెగా హీరోలు మాత్రమే కాదు అనేక మంది మేము సైతం అంటూ మద్దతు తెలిపారు.

# 39 ఏళ్ల తర్వాత పసుపుజెండా ఎగిరింది !



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం నుండి టీడీపీ యువనేత నారా లోకేష్ ఘనవిజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యపై లోకేష్ 76, 241 ఓట్ల రికార్డు మెజారిటీతో విజయం సాధించాడు. గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుండి పోటీ చేసిన లోకేష్ వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామక్రిష్ణారెడ్డిపై 5 వేల ఓట్ల తేడాతో పరాజయం పొందారు.

తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన 1983, 1985 ఎన్నికల్లో మంగళగిరి నుండి టీడీపీ అభ్యర్థి ఎంఎస్ఎస్ కోటేశ్వర్ రావు వరసగా రెండు సార్లు విజయం సాధించాడు. ఆ తర్వాత 1989లో కాంగ్రెస్, 1994లో సీపీఎం, 1999 నుండి 2009 వరకు కాంగ్రెస్ అభ్యర్థులు వరసగా విజయం సాధించారు 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామక్రిష్ణారెడ్డి విజయం సాధించాడు. గత 39 ఏళ్లుగా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురలేదు. ప్రస్తుతం నారా లోకేష్ గెలుపుతో అది సాధ్యం అయింది. గత ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఈ ఎన్నికలలో లోకేష్ కసిగా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రతో టీడీపీ మరింత బలోపేతం అయింది.

# జనసేన గెలుపు 5 కోట్ల మంది ఆకాంక్షకు ప్రతిరూపం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** జనసేన గెలవడం ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షకు ప్రతిరూపమని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కార్యకర్తలనుద్దేశించి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇది కక్ష సాధింపుల సమయం కాదని.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన పునాదులు వేసే సమయమని పార్టీ శ్రేణులకు చెప్పారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకం కాదని.. ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు గుర్తున్నాయన్నారు. పోటీ చేసి గెలిచింది 21 సీట్లలో అయినా 175 సీట్లలో గెలిపిస్తే ఎంత బాధ్యత ఉంటుందో అంతే బాధ్యతగా పనిచేస్తామన్నారు.

"ప్రజలకు జవాబుదారీతనం చెప్పే ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడుతుంది. జగన్తో నాకు వ్యక్తిగత కక్ష లేదు. కక్ష సాధింపు కోసం మనకి జనం అధికారం ఇవ్వలేదు. ఐదు కోట్ల ఆంధ్రులకు న్యాయం చేయాలి. నా జీవితం ఎప్పుడూ దెబ్బలు తినడమే. సినిమా పరంగా తొలిప్రేమ విజయం.. రాజకీయాల్లో ఈ విజయం. డబ్బు, పేరు కోసం నేను రాజకీయాల్లోకి రాలేదు. సగటు మనిషి కష్టం చూసి వచ్చా. 2019లో పోటీ చేసిన రెండు చోట్లా ఓడినప్పుడు నా పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. గెలుపోటములను సమానంగా తీసుకుంటున్నా. ఆకాశమంత విజయాన్నిచ్చిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెబుతున్నా. తెలుగుదేశం నేత వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు. పిఠాపురం ప్రజలు పవన్ ను గెలిపించలేదు.. రాష్ట్రంలో ఐదు కోట్ల మందిని గెలిపించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం" అని పవన్ స్పష్టం చేశారు.

# జగన్ మెజారిటీ తగ్గింది.. చంద్రబాబు ఆధిక్యం పెరిగింది



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ ఎన్నికల్లో కూటమి సునామీ సృష్టించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఎవరి అంచనాలకు అందని విధంగా టీడీపీ కూటమి గెలుపొందింది. ఈ క్రమంలో అనేక రికార్డులు బద్దలయ్యాయి. అటు వైసీపీ ఘోర పరాజయాన్ని చవి చూసింది. జగన్, పెద్దిరెడ్డి మినహా కేబినెట్ లోని మంత్రులంతా ఓటమి పాలయ్యారు.

ఈ ఫలితాలు వైసీపీకి బిగ్ షాక్ ఇచ్చాయి. వైసీపీ నేతలు ఈ రిజల్ట్స్ ను జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక వైసీపీ అధినేత జగన్ కు కూడా బిగ్ షాక్ అనే చెప్పాలి. ఆయన అధికారం కోల్పోవడమే కాదు.. ఆయన మెజార్టీ సైతం తగ్గింది. అటు టీడీపీ అధినేత చంద్రబాబు మెజార్టీ మాత్రం పెరిగింది.

గత ఎన్నికల్లో చంద్రబాబు 20,722 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈసారి ఆయన మెజార్టీ పెరిగింది. ప్రస్తుతం చంద్రబాబు 46వేల ఓట్ల మెజార్టీలో ఉన్నారు. ఇక జగన్ విషయానికి వస్తే ఆయన మెజార్టీ తగ్గింది. గత ఎన్నికల్లో జగన్ ఏకంగా 91వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆయన మెజార్టీ 61,687కు తగ్గింది.

## టిటిడి ఛైర్మన్ పదవికి భూమన కరుణాకరరెడ్డి రాజీనామా

**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవికి భూమన కరుణాకరరెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామాను ఆమోదించమంటూ తితిదే ఈవో ఏవీ ధర్మారెడ్డికి భూమన లేఖ రాశారు. గత ఆగస్టులో ఛైర్మన్‌గా భూమన బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల్లో వైసిపి ఓడిపోవడంతోనే భూమన రాజీనామా చేసినట్లు సమాచారం.

# కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు సంబరాలు..

● **కేక్ కట్ చేసి తినిపించిన దేవాన్ష్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభంజనం సృష్టించడంతో తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తన కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. కేక్ కట్ చేసిన చంద్రబాబు నాయుడి మనవడు దేవాన్ష్ అందరికీ తినిపించాడు.

చంద్రబాబు కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఫొటోలు దిగారు. వారిలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, యువనేత నారా లోకేశ్, ఆయన భార్య బ్రాహ్మణి, తదితరులు ఉన్నారు. కాగా, కాసేపట్లో చంద్రబాబు నాయుడి ఇంటికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుపై టీడీపీ, బీజేపీ, జనసేన చర్చించనున్నాయి.





**చంద్రబాబుతో సిద్ధార్థ్ సింగ్ భేటీ** చంద్రబాబు నాయుడిని బీజేపీ ఏపీ ఇన్‌చార్జ్ సిద్ధార్థ్ సింగ్ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిశా రు. తమ కూటమి విజయం సాధించడంతో చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలిపారు. చంద్ర బాబుకి మరి కొందరు నేతలు కూడా శుభాకాంక్షలు చెప్పారు.

# దేశ రాజకీయాల్లో కీలకంగా మారనున్న చంద్రబాబు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సార్వత్రిక సమరంలో బీజేపీ గెలిచినప్పటికీ... మెజారిటీ గతం కంటే తగ్గింది. పదేళ్ల పాటు దేశాన్ని పరిపాలించిన బీజేపీ సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి లేకుండా పోయింది. ప్రభుత్వ ఏర్పాటు కోసం కూటమిలోని పార్టీలపై బీజేపీ ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వ ఏర్పాటులో చంద్రబాబు కీలక పాత్ర పోషించనున్నారు. ఎన్డీయే కూటమిలో గతంలో మాదిరే బాబు కీలకంగా మారే అవకాశం ఉంది. దేశంలో అటు ఎన్డీయే ఇటు ఇండియా బ్లాక్‌గా రాజకీయ పార్టీలు అన్ని విడిపోయాయి. రెండు భారీ క్యాంపుల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఎన్డీయేలో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ తర్వాత తెలుగుదేశం మినహా మరే పార్టీకి అన్ని సీట్లలో విజయం సాధించలేవు. ఏపీలో ఎన్డీయే 21 స్థానాల్లో గెలుపొందగా... తెలుగుదేశం పార్టీ సింగిల్‌గా 16 సీట్లు సాధించుకుంది. ఈ బిగ్ నంబర్‌తో ఎన్డీయేలో మోడీ తర్వాత చంద్రబాబు కీలకం అ- య్యారు. బీజేపీ సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పడానికి సరిపడా అన్ని అవకాశాలు బాబుకు ఉన్నాయి. ఎన్డీయే కూటమికి టైట్ మార్జిన్ రావడంతో బాబు పాత్ర



అత్యంత కీలకం అయింది. ఇండియా కూటమిలోని మిత్రులను ఈ వైపునకు తీసుకుని వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. తద్వారా రాష్ట్రానికి కావాల్సిన నిధులను కేంద్రం నుంచి తీసుకురాగల సమర్థుడే. 1996 నాటి పరిస్థితులే ఢిల్లీలో చోటు చేసుకున్నాయి. రెండు జాతీయ పార్టీలకు అనుకున్న స్థాయిలో సీట్లు రాకపోవడంతో ప్రాంతీయ పార్టీల రాజకీయం మొదలయింది. ఆనాడు ప్రాంతీయ పార్టీలను ముందు పెట్టి యునైటెడ్ ఫ్రంట్ అన్న దానికి బాబు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు సైతం బీజేపీకి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం లేకపోవడంతో బాబు ఏమి చేస్తారు అనే చర్చ సాగుతోంది. జాతీయ రాజకీయాల్లో చంద్రబాబు కీలకపాత్ర పోషించే తరుణం ఆసన్నమైందని విశ్లేషకులు చెబుతున్నారు

# ప్రతిపక్ష హోదా సైతం దక్కించుకోని వైసీపీ

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ రాజకీయం తమిళనాడు రాజకీయాలను తలపిస్తోందా...? ఏపీ ప్రజలు విలక్షణ తీర్పు ఎందుకు ఇస్తున్నట్లు...? తమిళనాడు రాజకీయాలను ఏపీ ప్రజలు పుణికిపుచ్చుకున్నారా...? రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికలను చూస్తే ఏం అర్థమవుతుంది...? ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ అయింది. అధికార వైసీపీ గతంలో ఎన్నడూ లేనంత ఘోరంగా పరాజయం పాలైంది. కౌంటింగ్ మొదలుపెట్టినప్పటి నుంచి... కూటమి ఆధిక్యంలో దూసుకపోయింది. కూటమి విజయం సాధించినా.. వైసీపీ గట్టి పోటీ ఇస్తుందని చాలా మంది విశ్వసించారు. కానీ... కనీస స్థాయిలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. ఎన్నికల ముందు వై నాట్ 175 అన్న వైసీపీ నేతలు... ప్రతిపక్ష హోదా సైతం దక్కకపోవడంతో ఖంగుతిన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల స్వభావం ఎప్పటికప్పుడు మారుతూ వస్తుంది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీకి ఆంధ్ర ప్రజలు పట్టం కట్టారు. అధికారానికి కావాల్సిన సీట్లను కట్టబెట్టి ప్రభుత్వంలోకి తీసుకువచ్చారు. ఇక ఆ తర్వాత 2019లో నిర్వహించిన అసెంబ్లీ



ఎన్నికలలో టీడీపీని చెల్లాచెదురు చేశారు. ఆ దఫా వైసీపీకి ఏకంగా 151 అసెంబ్లీ స్థానాలను అంటగట్టి వారికి అద్భుతమైన మెజారిటీని అప్పగించి రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చారు.

ఓటరుతో పెట్టుకుంటే ఎంతటి వారైనా ఒక్కటే. ఎవరినైనా ఓడించే సత్తా మాకు ఉందని అని ఓటర్లు మరోసారి నిరూపించారు. వై నాట్ 175, కుప్పంలో కూడా మనం గెలుస్తున్నాం.. అంటూ ఎన్నికల ప్రచారం పూర్తి అయ్యే వరకు జగన్ చెప్పిన మాట ఇదే. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తాం, పిఠాపురంలో పవన్ కల్యాణ్, మంగళగిరిలో నారా లోకేష్‌ను ఓడిస్తాం అంటూ జగన్‌తో పాటు మంత్రులు, వైసీపీ నాయకులు పదేపదే చెప్పారు. కానీ మంత్రుల్లో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మినహా అందరూ ఓటమి చెందారు.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకపోయినా... కనీసం ప్రతిపక్ష హోదాలో అయినా అసెంబ్లీలో ఉండాలని పార్టీలు భావిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా... ప్రతిపక్ష హోదా రావాలంటే కనీసం 18 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకోవాలి. ఫలితాల ప్రారంభంలో వైసీపీకి కాస్త మెరుగైన ఫలితాలు వస్తాయనే అంచనా వేసినా... చివర్లో ప్రతిపక్ష హోదా సైతం దక్కకుండా పోయింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమంటే... వైసీపీ కంటే జనసేన అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది.

# హ్యాట్రిక్ వీరులు.. టీడీపీకి విధేయులు!

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** టీడీపీ ఏపీలో ఈవీఎంల కుంభస్థలం భేదించింది. ఏకంగా ఓట్ల వరద పారించింది. నైరుతిలో వర్షాలు ఇంకా ప్రారంభం కాకుండానే.. దీనికి సంకేతమా అన్నట్టుగా.. ఏపీలో ఓట్ల కుంభవృష్టి కురిసింది. అయితే.. ఈక్రమంలో అనేక సంచనాలు చోటు చేసుకున్నా యి. ఏడు సార్లు గెలిచిన వారు.. తొమ్మిదిసార్లు గెలిచిన చంద్రబాబుతోపాటు.. వరుసగా మూడు సార్లు హ్యాట్రిక్ కొట్టిన నాయకులు కూడా నాయకులు. అదేసమయంలో తొలిదశలోనే పోటీ చేసి విజయం దక్కించుకున్న వారు కూడా ఉన్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి విజయం దక్కించుకున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఏకంగా 7 సార్లు విజయం దక్కించుకున్నారు.

పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన టీడీపీ టికెట్‌పైనే మధ్యలో ఓడినా.. 7 సార్లు విజయం సాధించారు. ఇక, నర్సీపట్నం నుంచి పోటీచేసి.. మధ్యలో ఓడినా.. అయ్యన్నపాత్రుడు కూడా.. ఏడుసార్లు విజయం దక్కించుకున్నారు. అదేవిధంగా తాజాగా ఎన్నికల్లో పలువురు హ్యాట్రిక్ కొట్టారు. వీరిలో ఏలూరి సాంబశివరావు.. పరుచూరు నియోజకవర్గం నుంచి వరుస విజయం అందుకున్నారు. ప్రజానేతగా గుర్తింపు పొందారు. గొట్టిపాటి రవికుమార్.. అద్దంకి నుంచి మూడోసారి గెలుపు గుర్రం ఎక్కారు. 2014లో వైసీపీ, 2019, తాజా ఎన్నికల్లో టీడీపీ తరఫున ఆయన విజయం దక్కించుకున్నారు.

ఏపీ టీడీపీ చీఫ్ అచ్చెన్నాయుడు కూడా వరుసగా మూడో సారి విజయం దక్కించుకున్నారు. 2014లో తొలిసారి టెక్కలి నుంచి పోటీ చేసిన




ఆయన 2019, 2024 ఎన్నికల్లోనూ విజయం దక్కించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి పోటీ చేసిన బెందాళం అశోక్ కూడా..వరుసగా విజయం సాధించారు. అన్నగారి కుమారుడు.. నటసింహం నందమూరి బాలయ్య వరుసగా హిందూపురం నుంచిమూడోసారి విజయం దక్కించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లు నుంచి వరుసగా నిమ్మల రామానాయుడు మూడోసారి గెలుపు గుర్రం ఎక్కారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పెద్దాపురం నియోజకవర్గంలో నిమ్మకాయల చినరాజప్ప వరుసగా మూడోసారి గెలుపు గుర్రం ఎక్కారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి గద్దె రామ్మోహన్ 2014 నుంచి వరుస విజయాలు అందుకున్నా రు. గతంలో గన్నవరం ఎంపీగా కూడా గెలిచారు. రేపల్లె నియోజకవర్గం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన అనగాని సత్యప్రసాద్ కూడా వరుస విజయాలు అందుకున్నారు. ఇక, తాజా ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన గొట్టిపాటి లక్ష్మి దర్శి నుంచి విజయం సాధించారు. పిడుగురాళ్ల మాధవి గుంటూరువెస్ట్ నుంచి టీడీపీ తరఫున గెలుపు గుర్రం ఎక్కారు.

## చంద్రబాబుకు ప్రభుత్వ వైద్యుల సంఘం శుభాకాంక్షలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడం పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, నందమూరి బాలకృష్ణ, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధీశ్వరీ తో శాసనసభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన అభ్యర్థులందరికీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ డి.జయధీర్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాస్వామ్య బద్ధమైన పరిపాలన అందించాలని ఎన్నో సమస్యలుతో సతమతమవుతున్న ప్రభుత్వ వైద్యులును ఆదుకోవాలని, బోధనా వైద్యులకు రావాలసిన పీఆర్సీ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం మార్పుకు నాంది !



● **ప్రజల ఆశావహమైన ప్రభుత్వం ఏర్పడడాన్ని స్వాగతిస్తున్నాం ఏపీటీఎఫ్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఎన్డీఏ కూటమి పక్షాన ఏర్పడుతున్న నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, యస్. చిరంజీవి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసు తదితర శాఖల ఉద్యోగులు భారీగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగించుకోవడం మార్పుకు నాంది పలికిందని ఏపీటీఎఫ్ అభిప్రాయపడింది. నూతనంగా ఏర్పడే ప్రభుత్వం అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను సరిదిద్దాలని, 117 జి. వో ను రద్దు చేయాలని, గత ప్రభుత్వంలో కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలను, హక్కులను తిరిగి కల్పించాలని , సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్సీ అమలు,వివిధ రకాల ఇరవై అయిదు వేల కోట్ల బకాయిల చెల్లింపులు తదితర సమస్యలపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరించాలని మరియు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.

# ఎన్నికల ఫలితాల వేళ.. ఏపీలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఎన్నికల ఫలితాల వేళ ఏపీలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు పార్టీ ఆఫీస్ పై రాళ్ల దాడి జరిగింది. కారు అద్దాలను ధ్వంసం చేశారు గుర్తుతెలియని వ్యక్తులు. అలాగే, అక్కడి వైసీపీ ప్రచార రథం కూడా ధ్వంసం అయింది. కొవ్వూరు ఎమ్మెల్యేగా 33 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు గెలుపొందారు.

గుంటూరులోని గార్డెన్ సెంటర్‌లో వైసీపీ ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయంపై రాళ్ల దాడి జరిగింది. వైసీపీకి వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు. జై టీడీపీ అంటూ హోరెత్తించారు.

చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో ఘర్షణ చోటుచేసుకుంది. చెక్కునత్తం గ్రామంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ తలెత్తింది. కర్రలతో కొట్టుకున్నారు. పలువురికి గాయాలయ్యాయి.

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. పలువురు గాయపడ్డారు. ఐ.పోలవరం మండలం గోగుల్లంక పరిధిలోని భైరవలంక గ్రామంలో వర్గవిభేదాలు భగ్గుమన్నారు. దీంతో కార్యకర్తలు మాదేటి శ్రీను, ఉండ్రు పెంటయ్య, కూరాటి ఏడుకొండలకు గాయాలయ్యాయి. ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించారు.

# ముఖ్యమంత్రి పదవికి జగన్ రాజీనామా



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రికార్డ్ విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ పొలిటికల్ హిస్టరీలోనే ఇంతవరకు ఏ పార్టీ సాధించని ఘన విజయం సాధించి.. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో వైసీపీ అధినేత, సీఎం జగన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రిజైన్ లెటర్ను గవర్నర్ అబ్దుల్ నజీరక్కు పంపినట్లు సమాచారం. కాగా జగన్ నేతృత్వంలోని వైసీపీ 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో బరిలోకి దిగింది. గత ఎన్నికల్లో 151 ఎమ్మెల్యే సీట్లు సాధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి జగన్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సారి వై నాట్ 175 అంటూ ఎన్నికల బరిలోకి దిగిన వైసీపీ కదనరంగంలో చితకిలపడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఇంత వరకు ఏ పార్టీ ఓడని విధంగా ఓటమి చవి చూసింది. 175 అసెంబ్లీ స్థానాలకు గానూ కేవలం 9 సీట్లుకే పరిమితమైన ఊహించని ఓటమిని మూటగట్టుకుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలు కావడంతో జగన్ సీఎం పదవికి రాజీనామా చేశారు.

## ఏపీకి మంచి రోజులు రాబోతున్నాయి .. అంబటి రాయుడు ట్వీట్!



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ )** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఘన విజయం... వైసీపీ పార్టీ ఘోర పరాజయం నేపథ్యంలో టీం ఇండియా మాజీ క్రికెటర్.. అంబటి రాయుడు ఆసక్తికర ట్వీట్ చేశారు. టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి విజయం దిశగా అడుగులు వేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. 'ఇది ఏపీ ప్రజల గొప్ప విజయం. ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అభినందనలు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జట్టు కట్టారు. ఏపీకి మంచి రోజులు రాబోతు న్నాయి. ఈ అఖండ విజయంతో నారా లోకేష్ పాదయాత్ర కీలక పాత్ర పోషించింది' అని రాయుడు ట్వీట్ చేశారు.

## పశ్చిమంలో వైసీపీకి దక్కని సీటు

**● మొత్తం 15 స్థానాలలో విజయదుందుబి**
**● తొమ్మిది స్థానాలలో టీడీపీ**
**● ఆరు స్థానాలలో జనసేన గెలుపు**





**పశ్చిమగోదావరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మొత్తం 15 అసెంబ్లీ స్థానాలను టీడీపీ కూటమి విజయం సాధించింది.. టీడీపీ 9,. జనసేన ఆరు చోట్ల గెలుపొందాయి.

| స్థానం | పార్టీ | అభ్యర్థి |
|---|---|---|
| కొవ్వూరు | టీడీపీ | ముప్పిడి వెంకటేశ్వరరావు |
| నిడదవోలు | జనసేన | కందుల దుర్గేష్ |
| అచంట | టీడీపీ | పితాని సత్యనారాయణ |
| నరసాపురం | జనసేన | బొమ్మిడి నాయకర్ |
| భీమవరం | జనసేన | పులవర్తి రామాంజనేయులు |
| ఉండి | టీడీపీ | రఘురామకృష్ణంరాజు |
| తణుకు | టీడీపీ | అరిమిల్లి రాధాకృష్ణ |
| తాడేపల్లిగూడెం | జనసేన | పోలిశెట్టి శ్రీనివాస్ |
| దెందులూరు | టీడీపీ | చింతమనేని ప్రభాకర్ |
| ఉంగుటూరు | జనసేన | పి. ధర్మరాజు |
| ఏలూరు | టీడీపీ | బడేటి చంటి |
| గోపాలపురం | టీడీపీ | మద్దిపాటి వెంకటరాజు |
| చింతలపూడి | టీడీపీ | రోషన్‌కుమార్ సొంగా |
| పాలకొల్లు | టీడీపీ | నిమ్మల రామానాయుడు |

## విజయనగరంలో వైసీపీకి ఘోర పరాభవం

**● మొత్తం అన్ని స్థానాలలో టీడీపీ కూటమి ఘన విజయం**





**విజయనగరం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తం 9 అసెంబ్లీ స్థానాలను టిడిపి కూటమి కైవసం చేసుకుంది మంత్రి బొత్సకు తిరుగులేని కోటగా ఉన్న ఈ జిల్లాలో ఆయనతో సహా ఆయన కుటుంబ సభ్యులు ఓడిపోయారు. ఈ జిల్లాలో ఎనిమిది చోట్ల తెలుగుదేశం ,జనసేన ఒక చోట కేతనం ఎగురవేశాయి..

| స్థానం | పార్టీ | అభ్యర్థి |
|---|---|---|
| కురుపాం | టీడీపీ | జగదీశ్వరితోయిక |
| పార్వతీపురం | టీడీపీ | బోనేల విజయచంద్ర |
| సాలూరు | టీడీపీ | గుమ్మడి సంధ్యరాణి |
| బొబ్బిలి | టీడీపీ | బేబీనాయన |
| చీపురుపల్లి | టీడీపీ | కిమిడి కళావెంకటరావు |
| గణపతినగరం | టీడీపీ | కొండపల్లి శ్రీనివాస్ |
| నెల్లిమర్ల | జనసేన | లోకం మాధవి |
| విజయనగరం | టీడీపీ | అదితి గణపతిరాజు |
| శృంగవరపుకోట | టీడీపీ | కోళ్ల లలితకుమారి |

## ప్రకాశంలోనూ దూసుకెళ్లిన సైకిల్


**● 12 స్థానాలలోనూ వైసీపీ ఓటమి**




**ప్రకాశం (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాలలో తెలుగుదేశం విజయం సాధించింది. ఈ 12 స్థానాలలో పోటీ చేసిన వైసీపీ అభ్యర్థులందరూ ఓటమి పాలయ్యారు..

యర్రగొండపాలెం –టీడీపీ – గూడూరి ఎరిక్షన్ బాబు
దర్శి – టీడీపీ – గొట్టిపాటి లక్ష్మీ
పర్చూరు – టీడీపీ – ఏలూరి సాంబశివరావు
అద్దంకి – టీడీపీ– గొట్టిపాటి రవికుమార్
చీరాల – టీడీపీ – మద్దలూరి మాలకొండయ్య
సంతనూతలపాడు – టీడీపీ – బీఎన్ విజయకుమార్
ఒంగోలు – టీడీపీ –దామచర్ల జనార్ధన్
కందుకూరు – టిడిపి – ఇంటూరి నాగేశ్వరావు
కొండపి – టీడీపీ – డోలా బాల వీరాంజనేయస్వామి
మార్కాపురం – టీడీపీ – కందుల నారాయణరెడ్డి
గిద్దలూరు – టీడీపీ – ముత్తుముల అశోక్ రెడ్డి
కనిగిరి – టీడీపీ – ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

## శ్రీకాకుళంలో అంతా కూటమే





**శ్రీకాకుళం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 10 అసెంబ్లీ స్థానాలుండగా మొత్తం స్థానాలను టిడిపి కూటమి గెలుచుకుంది.. ఎనిమిది చోట్ల టిడిపి విజయం సాధించగా, జనసేన, బిజెపి ఒక్కో స్థానాన్ని దక్కించుకున్నాయి.. ఈ జిల్లా నుంచి పోటీ చేసిన స్పీకర్ తమ్మినేని సీతారం, మంత్రి ధర్మాన ప్రసాదరావు ఓటమి పాలయ్యారు.

ఇచ్ఛాపురం – టీడీపీ– బెందాళం అశోక్
పలాస –టీడీపి– గౌతు శిరీష
టెక్కలి –టీడీపీ– కింజరాపు అచ్చెన్నాయుడు
పాతపట్నం –టీడీపీ– మామిడి గోవిందరావు
శ్రీకాకుళం –టీడీపీ– గొండు శంకర్
ఆమదాలవలస –టీడీపీ– కూన రవికుమార్
ఎచ్చెర్ల –బిజెపి– ఎన్ ఈశ్వరరావు
నరసన్నపేట –టిడిపి– భగ్గు రమణమూర్తి
రాజాం –టీడీపీ– కోండ్రు మురళి
పాలకొండ –జనసేన– నిమ్మక జయకృష్ణ

## కడప జిల్లాలో జగన్ కు ఎదురుదెబ్బ

**● ఏకంగా ఆరు చోట్ల టీడీపీ కూటమిదే గెలుపు**
**● నాలుగు స్థానాలకే పరిమితమైన ఫ్యాన్**





**కడప ( జర్నలిస్ట్ ఫైల్ )** : ఉమ్మడి కడప జిల్లాలో జగన్ కు ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం 10 స్థానాలున్న ఈ జిల్లాలలో కేవలం నాలుగు స్థానాలకే వైసీపీ పరిమతమైంది. టీడీపీ నాలుగు చోట్ల, దాని మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన ఒక్కోస్థానంలో విజయం సాధించాయి

బద్వేల్ – వైసీపీ – డాక్టర్ దాసరి సుధ,
రాజంపేట – వైసీపీ – మేకపాటి అమరనాథ్ రెడ్డి
కడప – టీడీపీ – రెడ్డప్ప గారి మాధవి
కోడూరు – జనసేన – అదవ శ్రీధర్
రాయచోటి – వైసీపీ – గుడికోట శ్రీకాంత్ రెడ్డి
పులివెందుల – వైసీపీ – వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి
కమలాపురం – టీడీపీ – కృష్ణ చైతన్య రెడ్డి
జమ్మలమడుగు – బీజేపీ – ఆదినారాయణ రెడ్డి
ప్రొద్దుటూర్ – టీడీపీ –నంద్యాల వరదరాజులు
మైదుకూరు – టిడిపి – పుట్టా సుధాకర్ యాదవ్

## సైకిల్ జోరుకు అన్నిసీట్లు గల్లంతు

**●10 సీట్లలోనూ తెలుగుదేశం రెపరెపలు**





**నెల్లూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 10 అసెంబ్లీ స్థానాలను గెలుపొంది వైసీపీ గట్టి షాక్ ఇచ్చింది తెలుగుదేశం గతంలో ఒక్క సీటు కూడా గెలవని టీడీపీ ఈసారి అన్ని సీట్లు గెలిచి సంచలనం సృష్టించింది.

కావలి – టీడీపీ– వెంకట కృష్ణారెడ్డి
ఆత్మకూరు –టీడీపీ –ఆనం రాంనారాయణ రెడ్డి
కోవూరు – టీడీపీ – వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డ
నెల్లూరు సిటీ – టీడీపీ – పొంగూరు నారాయణ
నెల్లూరు రూరల్ – టీడీపీ – కోటం రెడ్డి శ్రీధరరెడ్డి
సర్వేపల్లి – టీడీపీ – సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
గూడూరు – టీడీపీ – పాశం సునీల్ కుమార్
సూళ్లూరుపేట – టీడీపీ – ఎం విధ్యశ్రీ
వెంకటగిరి – టీడీపీ – కురుగొండ్ల రామకృష్ణ
ఉదయగిరి – టీడీపీ – మేకపాటి రాజగోపాల్ రెడ్డి

## కృష్ణా జిల్లాలో ఫ్యాన్ కనుమరుగు

**● మొత్తం 16 స్థానాలలోనూ కూటమిదే గెలుపు**
**● టిడిపి 13 స్థానాలలో విజయం**
**● బిజెపి రెండు చోట్ల, జనసేన ఒక చోట పాగా**




**కృష్ణా (జర్నలిస్ట్ ఫైల్ )** : ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 16 అసెంబ్లీ స్థానాలలోనూ టిడిపి కూటమి విజయం సాధించింది. టిడిపి 13 స్థానాలు గెలుపొందగా, మిత్రపక్షలైన బిజెపి రెండు,జనసేన ఒక స్థానంలో గెలుపొందాయి .

గెలిచిన అభ్యర్థులు వీళ్లే..
తిరువూరు : టీడీపీ – కొలికపూడి శ్రీనివాసరావు
నూజివీడు : టీడీపీ – కె పార్థసారథి
గన్నవరం : టీడీపీ – యార్లగడ్డ వెంకట్రావు
గుడివాడ : టీడీపీ – వెనిగండ్ల రాము
కైకలూరు : బీజేపీ – కామినేని శ్రీనివాస్
పెడన : టీడీపీ – కాగిత కృష్ణప్రసాద్
మచిలీపట్నం : టీడీపీ – కొల్లు రవీంద్ర
అవనిగడ్డ : జనసేన – మండలి బుద్ధ ప్రసాద్
పామర్రు : టీడీపీ – కుమార రాజా
పెనమలూరు : టీడీపీ – బోడే ప్రసాద్
విజయవాడ వెస్ట్ : బీజేపీ – సుజనా చౌదరి
విజయవాడ సెంట్రల్: టీడీపీ – బోండా ఉమ
విజయవాడ ఈస్ట్: టీడీపీ – గద్దె రామ్మోహన్‌రావు
మైలవరం: టీడీపీ – వసంత కృష్ణప్రసాద్
నందిగామ: టిడిపి – తంగిరాల సౌమ్య
జగ్గయ్యపేట: టీడీపీ – శ్రీరాం తాతయ్య

## చిత్తూరు జిల్లా చంద్రబాబు వెంటే..

**●11 స్థానాలలో కూటమి పాగా**
**● మూడు స్థానాలకే పరిమితమైన ఫ్యాన్**





ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలలో టీడీపీ కూటమి ఏకంగా 11 స్థానాలలో పాగా వేసింది కేవలం మూడు స్థానాలతోనే వైసిపి ఇక్కడ సరిపెట్టుకుంది.. గతంకంటే ఈసారి ఇక్కడ అదనంగా ఆరు స్థానాలు గెలవడం విశేషం.

తంబళ్లపల్లె –వైసీపీ– పి ద్వారాకనాథ్ రెడ్డి
పీలేరు –టీడీపీ– నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి
మదనపల్లె –టిడిపి– ఎం షాజహాన్ భాష
పుంగనూరు –వైసీపీ– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
చంద్రగిరి –టీడీపీ– పులివర్తి నాని
తిరుపతి –జనసేన– అరణి శ్రీనివాసులు
శ్రీకాళహస్తి –టీడీపీ– బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి
సత్యవేడు –వైసీపీ– నూకతోటి రాజేష్
నగరి –టీడీపీ– గాలి భాను ప్రకాష్
గంగాధర నెల్లూరు –టిడిపి– వివిఎం థామస్
చిత్తూరు –టీడీపీ– గురజాల జగన్‌మోహన్
పూతలపట్టు –టీడీపీ– కలికిరి మురళీమోహన్
పలమనేరు –టీడీపీ– ఎం. అమర్‌నాథ్ రెడ్డి
కుప్పం –టీడీపీ– నారా చంద్రబాబు నాయుడు

## తూర్పులోనూ వైసీపీకి పరాభవం

**● కనీసం ఒక్క సీటు కూడా దక్కించుకోని వైనం**
**● టీడీపీ 13 చోట్ల ఘన విజయం**
**● జనసేన ఐదు స్థానాలలో, బీజేపీ ఒక స్థానంలో గెలుపు**





**●భారీ మెజార్టీతో జనసేనాని ఘన విజయం**

**తూర్పుగోదావరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలలో టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ 13 చోట్ల గెలుపొందగా, జనసేన అయిదు స్థానాలలో, బీజేపీ ఒక్క చోట గెలుపొందాయి..

తుని: టీడీపీ – యనమల దివ్య
ప్రత్తిపాడు: టీడీపీ – వరుపుల సత్యప్రభ
పిఠాపురం: జనసేన – పవన్ కల్యాణ్
కాకినాడ రూరల్: జనసేన – పంతం నానాజీ
పెద్దాపురం: టీడీపీ – నిమ్మకాయల చినరాజప్ప
అనపర్తి: బీజేపీ – నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి
కాకినాడ సిటీ: టీడీపీ – కొండబాబు
రామచంద్రపురం: టీడీపీ – విశ్వంశెట్టి సుభాష్
ముమ్మిడివరం: టీడీపీ – దాట్ల సుబ్బరాజు
అమలాపురం: టీడీపీ –ఎ. ఆనందరావు
రాజోలు: జనసేన – దేవ వరప్రసాద్
పి. గన్నవరం: జనసేన – గిడ్డి సత్యనారాయణ
కొత్తపేట: టీడీపీ – బండారు సత్యానందరావు
మండపేట: టీడీపీ – వేగుళ్ల జోగేశ్వరరావు
రాజానగరం: జనసేన – బత్తుల బలరామకృష్ణ
రాజమండ్రి సిటీ: టీడీపీ – ఆదిరెడ్డి వాసు
రాజమండ్రి రూరల్: టీడీపీ – గోరంట్ల బుచ్చయ్య చౌదరి
జగ్గంపేట: టీడీపీ – జ్యోతుల నెహ్రూ
రంపచోడవరం: టీడీపీ – మిరియాల శిరీషా దేవి

## కూటమికే జై కొట్టిన విశాఖ

**●మొత్తం 15 స్థానాలలో టిడిపి 8 చోట్ల విజయం**
**● జనసేన నాలుగు స్థానాలలో గెలుపు**
**● వైసిపి రెండు చోట్ల, బిజెపి ఒక స్థానంలోనూ పాగా**




**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలలో టిడిపి కూటమి పట్టు బిగించింది.. ఆర్థిక రాజధాని అంటూ ప్రచారంతో హోరెత్తించినా వైసిపి గాలి ఈ జిల్లాలో వీయలేదు.. మన్యంలోని రెండు స్థానాలలో మాత్రమే వైసిపి గెలుపు సాధించగా, మిగిలిన 13 చోట్ల టిడిపి, జనసేన,బిజెపిలు విజయం బాటపట్టాయి..

భీమిలి: టీడీపీ – గంటా శ్రీనివాసరావు
విశాఖపట్నం ఈస్ట్ : టీడీపీ – వెలగపూడి రామకృష్ణ
విశాఖపట్నం సౌత్ : జనసేన – వంశీ కృష్ణ శ్రీనివాస్
విశాఖపట్నం నార్త్: బీజేపీ – విష్ణుకుమార్ రాజు
విశాఖపట్నం వెస్ట్: టీడీపీ – గణబాబు
గాజువాక: టీడీపీ – పల్లా శ్రీనివాసరావు
చోడవరం: టీడీపీ – కె. ఎస్. ఎన్. రాజు
మాడుగుల: టీడీపీ– బండారు సత్యనారాయణ మూర్తి
అరకు: వైసీపీ – . రేగం మత్స్యలింగం
పాడేరు: వైసీపీ – ఎం విశ్వేశ్వరాజు
అనకాపల్లి: జనసేన – కొణతాల రామకృష్ణ
పెందుర్తి: జనసేన – పంచకర్ల రమేష్
యలమంచిలి: జనసేన – సుందరపు విజయకుమార్
పాయకరావు పేట: టీడీపీ – వంగలపూడి అనిత
నర్సీపట్నం: టీడీపీ – అయ్యన్న పాత్రుడు

## అనంతపురంలోనూ కూటమిదే పై చేయి

**•13 స్థానాలలో తెలుగుదేశం విజయం**
**•బీజేపీ ఒక చోటు గెలుపు**





**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ )** :ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలలో టీడీపీ కూటమి విజయం సాధించింది.. వైసీపీ బలమైన జిల్లాగా ఉన్న ఇక్కడ ఒక్క సీటు కూడా గెలువలేకపోయింది.. హిందూపురంలో హీరో బాలకృష్ణ ముచ్చటగా మూడో సారి విజయం సాధించి హ్యాట్రిక్ హీరోగా నిలిచాడు.

| స్థానం | పార్టీ | అభ్యర్థి |
|---|---|---|
| రాయదుర్గం | టీడీపీ | కాలువ శ్రీనివాసులు |
| ఉరవకొండ | టీడీపీ | పయ్యావుల కేశవ్ |
| గుంతకల్లు | టీడీపీ | గుమ్మనూరు జయరాం |
| తాడిపత్రి | టీడీపీ | జేసీ అస్మితారెడ్డి |
| సింగనమల | టీడీపీ | బండారు శ్రీవాణి |
| అనంతపురం | టీడీపీ | దగ్గుపాటి ప్రసాద్ |
| కల్యాణ దుర్గం | టీడీపీ | అమిలినేనిసురేంద్రబాబు |
| రాప్తాడు | టీడీపీ | పరిటాల సునీత |
| మడకశిర | టీడీపీ | ఎం. ఎస్. రాజు |
| హిందూపురం | టీడీపీ | నందమూరి బాలకృష్ణ |
| పెనుగొండ | టీడీపీ | సవితమ్మ |
| పుట్టపర్తి | టీడీపీ | పల్లె సింధూరరెడ్డి |
| ధర్మవరం | బీజేపీ | సత్యకుమార్‌యాదవ్ |
| కదిరి | టీడీపీ | కందికుంట వెంకటప్రసాద్ |

## గుంటూరు జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్

**• 16 చోట్ల టీడీపీ, ఒక స్థానంలో జనసేన విజయం**
**• జిల్లాలో బోణీ కొట్టని వైసిపి**
**• మంత్రి అంబటి రాంబాబు ఓటమి**





**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 17 స్థానాల్లో కూటమి పాగా వేసింది. ఇందులో 16 టీడీపీ, 1 జనసేన చోట్ల విజయం కేతనం ఎగురవేసింది.. జిల్లా మంత్రి అంబటి రాంబాబు ఓటమి పాలయ్యారు..

పెదకూరు పాడు – టీడీపీ – భాష్యం ప్రవీణ్
తాడికొండ – టీడీపీ – తెనాలి రామకృష్ణ
మంగళగిరి – టీడీపీ – నారా లోకేష్
పొన్నూరు – టీడీపీ – ధూళిపాళ్ల నరేంద్ర
వేమూరు – టీడీపీ – నక్కా ఆనందబాబు
రేపల్లె – టీడీపీ – అనగాని సత్యప్రసాద్
తెనాలి – జనసేన – నాదెండ్ల మనోహర్
బాపట్ల – టీడీపీ – వేగేశన నరేంద్రబాబు
ప్రత్తిపాడు – టీడీపీ – బూర్ల రామాంజనేయులు
గుంటూరు వెస్ట్ – టీడీపీ – గల్లా మాధవి
గుంటూరు ఈస్ట్ – టీడీపీ – మహ్మద్ నజీర్
చిలకలూరిపేట – టీడీపీ – ప్రత్తిపాటి పుల్లారావు
నరసరావుపేట – టీడీపీ – చదలవాడ అరవిందబాబు
సత్తెనపల్లి – టీడీపీ – కన్నా లక్ష్మీనారాయణ
వినుకొండ – టీడీపీ – జీవీ ఆంజనేయులు
గురజాల – టీడీపీ – యరపతినేని శ్రీనివాసరావు
మాచర్ల – టీడీపీ – జూలకంటి బ్రహ్మానందరెడ్డి

## కర్నూలు జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్

**● టీడీపీ 12 స్థానాలలో పాగా**
**● మిత్రపక్షం బీజేపీకి ఒక్క సీటు**
**● ఫ్యాన్ దక్కింది ఒక్క సీటే**




**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్ ) :** కర్నూలు జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలున్నాయి. వాటిలో 12 స్థానాలను టీడీపీ విజయం సాధించగా, బీజేపీ, వైసీపీ చెరో స్థానంలో గెలుపొందాయి.

ఆళ్లగడ్డ – టీడీపీ –భూమా అఖిల ప్రియ
శ్రీశైలం – టీడీపీ – బుడ్డా రాజశేఖరెడ్డి
నంది కొట్కూర్ – టీడీపీ – జయ సూర్య
కర్నూల్ – టీడీపీ – టీజీ భరత్
పాణ్యం – టీడీపీ –గౌరు చరితారెడ్డి
నంద్యాల – టీడీపీ– ఎన్. ఎం. డీ ఫరూక్
బనగాపల్లె – టీడీపీ– బీసీ జనార్ధన్ రెడ్డి
డోన్ –టీడీపీ– కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి
పత్తికొండ –టీడీపీ– కె ఈ శ్యామ్ కుమార్
కోడుమూరు –టీడీపీ– బొగ్గుల దస్తగిరి
ఎమ్మిగనూరు –టీడీపీ– జయనాగేశ్వరరెడ్డి
మంత్రాలయం –టీడీపీ– రాఘవేంద్రరెడ్డి
ఆదోని –బీజేపీ– డాక్టర్ పార్థసారథి
ఆలూరు –వైసీపీ– బూసినే వీరూపాక్షి

## కూటమి ఘన విజయం పై ఏపీ జేఏసి అమరావతి హర్షం

**● నాల్గవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబుకు ఉద్యోగుల తరపున శుభాకాంక్షలు**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం,జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చారిత్రాత్మక విజయం సాధించడంపై ఉద్యోగుల పక్షాణ ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర కమిటీ శుభాకాంక్షలు తెలియచేసింది.

ముఖ్యంగా నాల్గవసారి రాష్ట్ర ముఖ్యమంత్రి గా భాద్యతలు చేపట్టనున్న నారా చంద్రబాబు నాయుడుకు... ... అదేవిధంగా మంగళగిరి, పిఠాపురం స్థానాల్లో చారిత్రాత్మక విజయం నమోదు చేసిన నారా లోకేష్, పవన్ కళ్యాణ్ లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు

ఏపిజెఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్ టి. వి. ఫణి పేర్రాజు, కోశాధికారి వి. వి. మురళికృష్ణ నాయుడు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

అలాగే చరిత్ర సృష్టిస్తూ 80% పోలింగ్ జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటుగా ... ప్రధానంగా పోస్టల్ బ్యాలెట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎన్నడూ లేనంతగా 5 లక్షల 30వేల ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా ఐఏఎస్ మరియు కమిషన్ లోని ఇతర ఉన్నతాధికారులుకు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ తరుపున ప్రతేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఏపిజెఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావులు తెలిపారు.

అంతే కాకుండా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధిక సంఖ్యలో నమోదు చేసుకోవడానికి ఉద్యోగులందరికీ స్వేచ్ఛను కల్పించే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడమే కాకుండా.. ఉద్యోగులు ఓట్లు చెల్లకుండా చేయాలని కుట్రలు జరిగినప్పటికీ ఉద్యోగుల ఓటు హక్కుకు భంగం కలుగకుండా న్యాయం జరిగేలా ఆదేశాలు ఇవ్వడమే కాకుండా న్యాయస్దానాల్లో కూడా ఉద్యోగుల పక్షాణ ఉండి పోస్టల్ బ్యాలెట్లుకు న్యాయం జేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు

అలాగే రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి ఎక్కడా 'రీ పోల్' కు కూడా అవకాశం ఇవ్వకుండా రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించి నందుకు ఏపిజెఏసి అమరావతి రాష్ట్రకమిటి తరుపున అభినందిస్తున్నామని వారు తెలిపారు.

# ధర్మం గెలిచింది

(మొదటిపేజీ తరువాయి)

నాగార్జున, విడుదల రజనీ, అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్ కాకాని గోవర్ధన్‌రెడ్డి, బుగ్గన రాజేంద్ర, నారాయణ స్వామి, ఉషశ్రీ, రోజా, అంజాద్ బాష ఓడిపోయారు. గుమ్మనూరు జయరాం టిడిపి చేరి నుంచి గెలిచారు. అటు ఉత్తరాంధ్రలో బోత్స, ధర్మాన లాంటి అగ్రనేతల నుంచి గుడివాడలో మాజీ మంత్రి కొడాలి నానిటి మట్టి కరిచారు. ప్రకాశం, నెల్లూరు. రాయలసీమల్లోని వైకాంగ్రెస్ సీనియర్ నేతలు, మంత్రులుగా పనిచేసిన వాళ్లకూటమి గాలిలో తుడిచిపెట్టుకుని పోయాయి. వైసీపీ గెలిచిన 11 స్థానాల్లో పులివెందులలో సిఎం జగన్, బద్వేలు దాసరి సుధ, పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రాలయంల వై బాలనాగిరెడ్డి, ఆలూరు బూసినే విరుపాక్షి, యర్రగొండపాలెం, తాటిపత్రి చంద్రశేఖర్, అరకు రేగం మత్స్యలింగం, పాడేరు మత్స్యరాన విశ్వేశ్వరరాజ, రాజంపేట ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి తంబళ్ళపల్లి పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, దర్శి శివప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు, వైకాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో మొదటి తొమ్మిదిని అధికారికంగా ప్రకటించారు. తరువాత యర్రగొండపాలెంలో తాటిపత్రి చంద్రశేఖర్, దర్శిలో శివప్రసాద్ రెడ్డి గెలిచినట్లు ప్రకటించారు.

ఇక మహాకూటమి ఘన విజయాలు సాధించడంలో వ్యూహాత్మక ఎత్తుగడ లను అనుసరించి గత ఎన్నికలో 23 స్థానాలను టిడిపి గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఈ ఎన్నికల్లో పోటీ చేసారు. పవన్ కల్యాణ్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి చంద్రబాబుతో కలిసి ఏపీలో సామాజిక సమీకరణాలు కలిసి వస్తుందనే అంశాన్ని గుర్తించారు. సంక్షేమ పథకాలు తప్పనిసరి అనిగుర్తిం చారు. కొన్ని జిల్లా కాపు, కమ్మ, క్షేత్రీయ క్యాంబోతో ఎన్నికల్లో మందుకు వెళ్లారు మంచి ఫలితాలు సాధించారు. సిఎం జగన్ నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలనే నినాదాన్ని పక్క పెట్టించారు. ఆధిపత్యాల కులాలుగా దీటుగా దిగువ కులాల పోటీకి వస్తే పరిస్థితులపై సాధారణ ఓటర్లు అవగాహన కల్పించారు. ఉద్యోగులను తమ వైపుకు మరించుకున్నారు. మొత్తమ్మీద ఈ ఎన్నికల్లో గత ఎన్నికల చివరిలో తప్ప ప్రజల మధ్యకు వచ్చిన సిఎం జగన్ ప్రచార యాత్రలకు వచ్చిన అనుకు న్నంతగా జనం పట్టించుకోలేదు. విపక్ష మేని ఫెస్టోను ఎద్దేవా చేస్తూ జగన్ చేసిన విమర్శలు, ప్రజలు కోరుతున్న ద్వాక్రా రుణ మాఫీ, ఉచిత గ్యాస్బండ్లపై, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై భరోసా ఇవ్వలేదు. ల్యాండ్ టైటిల్పై స్పష్టం ఇవ్వలేని పరిస్థితిలో పడింది. అడుగడుగున విపక్షాల ర్యాలీలను అడ్డుకుని వారికి సానుభూతిని పెంచి సజ్జల, బొత్సలతో ఉద్యోగ సంఘాలను అవమానించింది. ఈ పరిస్థితులన్నింటిని టిడిపి. పవన్ బిజెపి తనకు అనుకూలరీతిలో ఓట్లు మలుచుకున్నారు . మొత్తం మీద ఎన్నికల్లో తెలుగుదేశం తన సత్తా నిరూపించు కుంది. ఇక ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశలో చంద్రబాబు. జనసేన కూటమి సన్నాహాలు చేస్తున్నాయి.. నేడు ఢిల్లీ ఎన్డీఏ మీటింగ్ కు వెళ్తున్నాయి. ఈ ఎన్నికలో కాంగ్రెస్. సిపిఐ, సిపిఎం. జెడి లక్ష్మీనారాయణ, జడ శ్రావణకుమార్ పార్టీ ప్రభావం చూపించలేదు. తాజా సమాచారాన్ని అనుసరించి టిడిపి 16, 4. జనసేన – 2 బిజెపి విజయం సాధించాయి. ఇక టిడిపి అధికారంలోకి రావడానికి కీలకమైన వృద్దాప్య పెంచన్లు పెంపు, మహిళల ఉచిత బస్ ప్రయాణం వంటి అంశాలు వెంటనే అమలులోకి రావాల్సి ఉంది.

## కూటమిని ఆశీర్వదించిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు: చంద్రబాబు

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** టీడీపీ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి సందేశం వెలువరించారు. "ఏపీ గెలిచింది. ఏపీ ప్రజలు గెలిచారు. ఇవాళ నా హృదయం కృతజ్ఞతాభావంతో ఉప్పొంగుతోంది. ఓట్ల వెల్లువతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిని ఆశీర్వదించిన మన రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాడి గెలిచాం. దెబ్బతిన్న రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేస్తాం.

ఈ సందర్భంగా ఏపీ భవిష్యత్తుకు కట్టుబడి ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఏపీలో మా కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలను అభినందిస్తున్నాను. మా కూటమి కార్యకర్తలు, నేతల కఠోర శ్రమ, అంకితభావం ఫలితంగా ఈ చారిత్రాత్మక విజయం సాకారమైంది. చివరి ఓటు కూడా పడే వరకు వాళ్లు తెగించి పోరాడిన తీరు అద్భుతం. ఈ సందర్భంగా మా కూటమి నేతలకు, కార్యకర్తలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అంటూ చంద్రబాబు స్పందించారు.

## ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరును మార్చేసిన టీడీపీ కార్యకర్తలు

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీలో కూటమి బంఫర్ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమైపోయింది. దీంతో టీడీపీ కార్యకర్తల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు విజయవాడలో వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పేరును ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా మార్చారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్పు చేస్తూ అసెంబ్లీలో సవరణ బిల్లును గతంలో వైసీపీ సర్కార్ పాస్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినా వెనక్కితగ్గని వైసీపీ సర్కార్ పేరును మార్చేసింది. తాజాగా టీడీపీ కూటమి అధికారంలోకి రావడం పక్కా అవ్వడంతో టీడీపీ శ్రేణులు ఆ పేరును మళ్లీ ఎన్టీఆర్ గా మార్పు చేశారు.



## తెలంగాణ వార్తలు

# ఎంపీగా రఘువీర్ రెడ్డి విజయం.. తెలుగు రాష్ట్రాల్లో రికార్డు



**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో నల్గొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి రికార్డు విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి
శానంపూడి సైదిరెడ్డిపై 5.59 లక్షల భారీ మెజారిటీతో రఘువీర్ గెలిచారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఎంపీగా రికార్డు సృష్టించారు. ఇంతకుముందు 2011లో కడప లోక్ సభ ఉప ఎన్నికలో వైఎస్ జగన్ 5.43 లక్షల ఆధిక్యం సాధించారు. ఇప్పుడు ఆ రికార్డును రఘువీర్ అధిగమించారు.

**బీఆర్ఎస్.. ఒక్కటీ లేదు**

పదేళ్లపాటు అధికారంలో ఉండి.. ఇటీవల ఓడిపోయిన భారాసకు లోక్సభలో ప్రాతినిధ్యం కష్టం కానుంది. మొత్తం 17 లోక్సభ స్థానాల్లో కాంగ్రెస్ ఎనిమిదింట్లో విజయం సాధించింది. భాజపా మూడింట్లో గెలిచి మరో 5 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. మజ్లిస్ తరపున అసదుద్దీన్ భారీ ఆధిక్యంలో ఉన్నారు. కొన్ని రౌండ్ల వరకు మెదక్ లోక్ సభ స్థానం నుంచి భారాస గట్టి పోటీనిచ్చినా మళ్లీ వెనుకబడిపోయింది.

# ఉత్కంఠ పోరులో మాధవి లత పై ఒవైసీ గెలుపు



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** 2024 పార్లమెంట్ ఎన్నికల్లో దేశ రాజకీయాలు మొత్తం హైదరాబాద్ వైపు మళ్లాయి. బీజేపీ, ఎంఐఎం మధ్య పోటా పోటిగా సాగిన ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో అనే చర్య దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. కాగా మాధవి లత అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి ఒవైసీని ముచ్చెమటలు పట్టించింది. మొదటి ఐదు రౌండ్లలో ఆధిక్యంలో కొనసాగిన మాధవి లత.. ఆ తర్వాత తన ఆధిక్యాన్ని కోల్పోయింది. ఈ క్రమంలో ఒవైసీ బీజేపీ అభ్యర్థి పై ఏకంగా 3,15,811 ఓట్ల తేడాతో విజయం సాధించారు. కాగా ఇది అతనికి వరుసగా ఐదో విజయం కావడం విశేషం. కాగా ఈ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 8 స్థానాల్లో విజయం దిశగా ముందుకు దూసుకుపోతుంది. అలాగే అధికార కాంగ్రెస్ కూడా 8 స్థానాల్లో విజయం సాధించింది.

# ఉమ్మడి వరంగల్, ఖమ్మంలో కాంగ్రెస్ హవా

- కడియం కావ్య, బలరాం నాయక్, రఘురాం రెడ్డి భారీ విజయం



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసినట్లుగానే కాంగ్రెస్, బీజేపీల మధ్య హెూరాహెూరీ పోరు సాగుతోంది. దాదాపు చెరి సగం సీట్లను దక్కించుకునేలా ఫలితాలు కనిపిస్తున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు కాంగ్రెస్, బీజేపీలు పలు స్థానాలను దక్కించుకున్నాయి. ఇక, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఏమాత్రం ప్రభావం చూపకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఆరు స్థానాలు ఖాతాలో వేసుకోగా, మరో రెండింట ఆధిక్యంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే వరంగల్‌లో కడియం కావ్య 2 లక్షల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. బీజేపీకి చెందిన ఆరూరి రమేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి సంజీవ కుమార్ రెండు,మూడు స్థానాలకే పరిమితమయ్యారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కవితపై 3 లక్షల 24 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆ హీరోయిన్ మీద కోపంతో సమంత బోల్డ్ షో లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల ఫలితాలు బీజేపీకి మైనస్ సీట్లు అయినా మానం కాపాడుకున్న నాయకులు, సెక్స్ సెండల్ హీరో ఔట్ !! మరోవైపు, ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి 3.5 లక్షలకుపైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై ఆయన గెలుపొందారు. ఇక, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు మల్లు రవి (నాగర్ కర్నూల్), గడ్డం వంశీకృష్ణ(పెద్దపల్లి), చామల కిరణ్ కుమార్ రెడ్డి (భువనగిరి), కుందురు రఘువీర్ రెడ్డి (నల్గొండ), సురేష్ షెట్కార్ (జహీరాబాద్) ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇది ఇలావుంటే, మల్కాజిగిరి, మెదక్, చేవెళ్ల, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. హైదరాబాద్ ఎంపీ స్థానంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ముందంజలో ఉన్నారు.

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది.

# బీజేపీకి మైనస్ సీట్లు అయినా మానం కాపాడుకున్న నాయకులు, సెక్స్ సెండల్ హీరో ఔట్ !!



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** లోక్ సభ ఎన్నికల ఫలితాలు బీజేపీతో పాటు ఎన్డీఏ కూటమి అభ్యర్థులు నిరాశ చెందుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఎన్డీఏ నాయకులు ఊహించిన 400 ఎంపీ సీట్లు రాకపోవడంతో ఆ పార్టీల నాయకులు అయోమయంలో పడిపోతున్నారు. ఇదే సమయంలో ఇండియా కూటమిని ప్రజలు ఆధరించడంతో ఆ కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ఇండియా కూటమి లీడర్స్ కు రానురాను ధైర్యం వస్తోంది. 175 అంటే ఇదేనా జగనన్న ?, ఎలా ఉండేవాళ్లు ఎలా అయిపోయారు ? ఇక గత లోక్ సభ ఎన్నికల్లో 25 ఎంపీసీట్లు కైవసం చేసుకున్న బీజేపీ నాయకులు ఈసారి 17 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కర్ణాటకలో జరిగిన కొన్ని రాజకీయ పరిణాల దెబ్బతో బీజేపీ దెబ్బ తినింది అని చెప్పాలి. బీజేపీకి 17 సీట్లు, ఎన్డీఏ మిత్రపక్షం అయిన జేడీఎస్ రెండు సీట్లలో విజయం సాధించారు. కర్ణాటక మాజీ సీఎం హెచ్ డీ కుమారస్వామి మండ్యలో ఎంపీగా విజయం సాధించడంతో జేడీఎస్ నాయకులతో పాటు బీజేపీ నాయకులు ఊపిరిపీల్చుకున్నారు. ఏపీలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై దుమారం: ఈసీ కీలక ప్రకటన..!! లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల ఫలితాలు ఇక సెక్స్ స్కాండల్ కేసులో చిక్కుకున్న లోక్ సభ రెండో విడత పోలింగ్ కు ముందు బీజేపీ, జేడీఎస్ పార్టీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అదే హాసన్ లో ఓడిపోయారు. మైనింగ్ కింగ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ప్రాణ స్నేహితుడు, మాజీ మంత్రి బి, శ్రీరాములు సైతం బళ్లారిలో ఓడిపోయారు. లోక్ సభ ఎన్నికలకు ముందు గాలి జనార్దన్ రెడ్డి బీజేపీలో చేరినా ఉత్తర కర్ణాటక, హైదరాబాద్ కర్ణాటకలో ఆయన ప్రభావం బీజేపీలో పెద్దగా కనిపించలేదనే చెప్పాలి. జగన్ ఉంటే సరిపోదు నాయనా, జనం కూడా ఉండాలని తెలుసుకోండి, అదే జీవిత సత్యం ! ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కోలారు లోక్ సభ నియోజక వర్గం నుంచి జేడీఎస్ టిక్కెట్ తో పోటీ చేసిన మల్లేష్ బాబు ఎవ్వరూ ఊహించని విధంగా విజయం సాధించారు. ఇక బెంగళూరులో బీజేపీ ఎంపీలు విజయం సాధించడంతో బీజేపీ నాయకులు హ్యాపీగా ఉన్నారు. కర్ణాటక డీసీఎం, కేపీసీ అధ్యక్షుడు డీకే సురేష్ ను బెంగళూరు గ్రామీణ జిల్లా ప్రజలు ఓడించారు. డీసీఎం డీకే శివకుమార్ తన తమ్ముడిని గెలిపించుకోలేకపోవడంతో ఆయన అభిమానులు నిరాశ చెందారు. బెంగళూరు గ్రామీణ లోక్ సభ నియోజక వర్గంలో డీకే శివకుమార్ మీద పోటీ చేసిన మాజీ ప్రధాని హెచ్ డీ దేవేగౌడ అల్లుడు, డాక్టర్ సీఎన్. మంజునాథ్ విజయం సాధించారు. కర్ణాటకలో 17 ఎంపీ సీట్లలో బీజేపీ, రెండ సీట్లలో జేడీఎస్ విజయం సాధించడంతో ఆ పార్టీల నాయకులు ఊపిరిపీల్చుకున్నారు.

రెండో విడతలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ దెబ్బ పడిందని బీజేపీ నాయకులు అంటున్నారు. శివమొగ్గలో మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు బీవై రాఘవేంద్ర చేతిలో హ్యాట్రిక్ హీరో శివకుమార్ కుమార్ భార్య గీతా శివరాజ్ కుమార్ ఓడిపోయారు.

# ఆదిలాబాద్‌లో గోడం నగేష్ గెలుపు..



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణలో 17 ఎంపీ స్థానాలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నువ్వానేనా అంటూ తలపడ్డాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభావం పొందిన బీఆర్ఎస్ ఖాతా తెరవకుండా చతికిలపడింది. కాగా, ఆదిలాబాద్ లో సిట్టింగ్ స్థానాన్ని బీజేపీ నిలుపుకుంది. ఈ స్థానంలో 80 వేల ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ గెలిచారు.

# 2 లక్షల మెజార్టీతో బండి సంజయ్ గెలుపు... తెలంగాణలో 13 స్థానాల్లో గెలిచిన అభ్యర్థులు వీరే...

- 4 చోట్ల గెలిచి 4 చోట్ల ముందంజలో బీజేపీ
- 8 స్థానాల్లో విజయం సాధించిన కాంగ్రెస్
- హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ విజయం

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 8 చోట్ల గెలిచింది. బీజేపీ 4 చోట్ల గెలిచి... నాలుగింట ముందంజలో ఉంది. మజ్లిస్ పార్టీ హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో విజయం సాధించింది. మొత్తం 17 లోక్ సభ నియోజకవర్గాలకు గాను బీఆర్ఎస్ ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది.

ఆదిలాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ 78వేల మెజార్టీతో విజయం సాధించారు. నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ 1.13 లక్షల మెజార్టీతో గెలిచారు. కరీంనగర్ నుంచి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ 2.12 లక్షల మెజార్టీతో గెలిచారు. మహబూబ్ నగర్ నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 8వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు.

నల్గొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి 5.51 లక్షల మెజార్టీతో గెలిచారు. ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి 4.56 లక్షల మెజార్టీతో విజయం సాధించారు. వరంగల్‌లో కడియం కావ్య 2.02 లక్షల మెజార్టీతో గెలిచారు.

మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 3.24 లక్షల మెజార్టీతో గెలిచారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ 45వేలకు పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి 1.95 లక్షల మెజార్టీతో గెలిచారు. నాగర్ కర్నూలలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి 85వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1.31 లక్షల మెజార్టీతో గెలిచారు.

# ఒక్కరు తప్ప.. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్ళిన వారంతా ఓటమి

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లి పోటీ చేసిన నేతలు ఓడిపోయారు. తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ ఓటర్లు మాత్రం ఆశించిన మేర వారిని అక్కున చేర్చుకోలేదు. తిరస్కరించినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ బీఆర్ఎస్కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మల్కాజ్ గిరి నుంచి పోటీ చేసిన పట్నం సునీతామహేందర్ రెడ్డి సైతం కారు దిగి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆమె సైతం ప్రభావం చూపలేకపోయింది. అక్కడ బీజేపీ విజయం సాధించింది.

చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి సైతం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్లో చేరి ఎంపీగా పోటీ చేశారు. అయితే అక్కడ బీజేపీ విజయం సాధించింది. నాగర్ కర్నూల్ ఎంపీ రాములు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు భరత్కు ఎంపీ టికెట్ తెచ్చుకొని పోటీచేశారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దానం నాగేందర్ కాంగ్రెస్ లో చేరారు. సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయగా ఓడిపోయారు. ఒక్క వరంగల్లో కారుదిగి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కడియం కావ్యమాత్రం సక్సెస్ అయింది. ఘన విజయం సాధించింది.

# మళ్లీ ఫీనిక్స్ పక్షిలాగా లేస్తాం.. ఎంపీ ఫలితాలపై కేటీఆర్ రియాక్షన్



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** ఎంపీ ఫలితాల్లో బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రంలో బోణికొట్టలేకపోయింది. ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్న ఎగ్జాట్ పోల్స్ తమకు అనుకూలంగా ఉంటాయని బీఆర్ఎస్ నేతలు చెబుతూ వచ్చారు. అయితే తాజాగా మంగళవారం వెలువడిన ఫలితాలలో బీఆర్ఎస్ ఒక్క సీటును గెలుచుకోలేకపోయింది. ఇదే అంశంపై ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గత 24 ఏళ్లలో అనేక ఒడిదొడుకులు, మధురమైన విజయాలను చూశాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే తమకు అతి పెద్ద మైలు రాయి. ప్రాంతీయ పార్టీగా తాము 2014లో 119 స్థానాలకు 63, 2018లో 88 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని వరుసగా రెండు సార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుతం 119 స్థానాల్లో 39 సీట్లు, అంటే ఒకటిలో మూడో వంతుతో తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్నాం. ఈ రోజు వెలువడిన ఫలితాలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. కానీ రానున్న కాలంలో బూడిదలోంచి లేచిన ఫీనిక్స్ పక్షిలా తప్పకుండా పైకి లేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కేసీఆర్, హరీష్ రావుకు భారీ ఝులక్..

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** మెదక్ లో కారు షెడ్డుకే పరిమితం అయింది. విజయం సాధిస్తామని భావించారు. ప్రజలు మాత్రం రివర్స్ ఫలితం ఇచ్చారు. సిద్దిపేట నుంచి హరీష్ రావు, గజ్వేల్ నుంచి కేసీఆర్ విజయం సాధించారు. పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా 6 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఒక్క మెదక్ అసెంబ్లీలో కాంగ్రెస్ గెలిచింది. అయితే లోక్సభ ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా బీజేపీ పుంజుకుంది. ప్రజలంతా కాషాయ పార్టీకే పట్టం కట్టారు. కారుమాత్రం రెండోస్థానానికి పరిమితం అయింది. మామ, అల్లుళ్లు ఒకే పార్లమెంట్ పరిధిలోనే ఉండటం, ప్రచారం ముమ్మరం చేయడంతో పాటు రోడ్డు షోలు చేపట్టినప్పటికీ ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయారు. అనూహ్యంగా ఓటర్లు తీర్పు ఇచ్చి ఇద్దరికి ఝులక్ ఇచ్చారు.

# తెలంగాణలో విజేతల వివరాలు...

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ లోకసభ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. మొత్తం 17 లోక్సభ స్థానాలకు ఫలితాలు వెల్లడించారు. కాంగ్రెస్ ఎనిమిది చోట్ల గెలుపొందగా.. భాజపా ఎనిమిది చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఎంఐఎం తన సీటును పదిలపరుచుకోగా.. భారాస ఎక్కడా ఖాతా తెరవలేకపోయింది. ఖమ్మం, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, జహీరాబాద్, భువనగిరి, నాగర్ కర్నూలు, పెద్దపల్లిలో కాంగ్రెస్ విజయఢంకా మోగించగా.. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, మెదక్, మల్కాజ్ గిరి, చేవెళ్ల, సికింద్రాబాద్ లో భాజపా అభ్యర్థులు గెలిచారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే అత్యధిక అత్యధిక మెజార్టీతో జానారెడ్డి తనయుడు రఘువీర్ రెడ్డి రికార్డు నెలకొల్పారు. దాదాపు 10 మంది నేతలు లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం విశేషం.

నల్గొండలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి ఘన విజయం సాధించారు. భాజపా అభ్యర్థిసైదిరెడ్డిపై 5,59,905 ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించడం విశేషం. తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే అత్యధిక మెజార్టీ. 2011లో కడప లోక్సభ ఉప ఎన్నికలో 5.43 లక్షల మెజార్టీతో జగన్ గెలవగా.. అంతకుమించిన మెజార్టీతో రఘువీర్ విజయం సాధించారు.



- ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి విజయం సాధించారు. ఆయన భారాస అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై 4,67,847 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- మల్కాజిగిరిలో భాజపా అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ భారీ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిపై ఆయన 3,91,4753 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- మహబూబ్ నగర్ లో జరిగిన ఉత్కంఠ పోరులో భాజపా అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిపై స్వల్ప ఆధిక్యంతోనే విజయం సాధించారు. రౌండ్ రౌండ్కు ఇక్కడ ఆధిక్యాలు మారడంతో నెలకొన్న ఉత్కంఠ పోరులో డీకే అరుణ కేవలం 4,500 ఓట్లతో గట్టెక్కారు.
- చేవెళ్లలో భాజపా అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధిక్యంలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిపై దాదాపు 1,72,897 ఓట్ల మెజార్టీ సాధించారు.

మహబూబాబాద్లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ తన సమీప ప్రత్యర్థి భారాస నేత మాలోతు కవితపై 3.49 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించారు.

- హైదరాబాద్లో ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ 3,38,087 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఒవైసీకి మొత్తంగా 6,61,981 ఓట్లు రాగా.. భాజపా అభ్యర్థి మాధవీలతకు 3.23లక్షలు, కాంగ్రెస్ అభ్యర్థికి 62వేలు, భారాస అభ్యర్థికి 18వేలు చొప్పున ఓట్లు పోలయ్యాయి.

వంశీచంద్ రెడ్డిపై స్వల్ప ఆధిక్యంతోనే విజయం సాధించారు. రౌండ్ రౌండ్కు ఇక్కడ ఆధిక్యాలు మారడంతో నెలకొన్న ఉత్కంఠ పోరులో డీకే అరుణ కేవలం 4,500 ఓట్లతో గట్టెక్కారు. చేవెళ్లలో భాజపా అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధిక్యంలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిపై దాదాపు 1,72,897 ఓట్ల మెజార్టీ సాధించారు.

- కరీంనగర్ లోక్సభ సీటు నుంచి భాజపా నేత బండి సంజయ్ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ నేత వేల్చాల రాజేందర్ రావుపై 2,25,209 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయకేతనం ఎగురవేశారు. భాజపా అభ్యర్థి ఆరూరి రమేష్ పై 2,20,339 ఓట్ల తేడాతో రికార్డు విజయం నమోదు చేసుకున్నారు.

భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్కుమార్ రెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, భాజపా అభ్యర్థి డా. బూర నర్సయ్య గౌడ్ పై 2,22,170 ఓట్ల తేడాతో విజయఢంకామోగించారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపొందారు. భాజపా అభ్యర్థి శ్రీనివాస్ పై 1,31,364 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

- నిజామాబాద్లో భాజపా అభ్యర్థి ధర్మపురి అర్వింద్ తన సీటును పదిలపరుచుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డిపై 1,09,241 ఓట్ల మెజార్టీ సాధించి జయకేతనం ఎగురవేశారు.
- నాగర్ కర్నూలులో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి గెలుపొందారు. భాజపా అభ్యర్థి భరత్ ప్రసాద్ పోతుగంటిపై 94,414 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ భారాస అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్కుమార్కు దాదాపు 3.2లక్షల ఓట్లు వచ్చాయి.
- ఆదిలాబాద్ లోక్సభ సీటు నుంచి భాజపా అభ్యర్థి నగేష్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై ఆయన 90,652 ఓట్లకు పైగా మెజార్టీతో గెలుపొందారు.
- జహీరాబాద్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తన ప్రత్యర్థి, భాజపా నేత బీబీ పాటిల్పై 46,188 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- సికింద్రాబాద్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్పై 49,944 ఓట్ల తేడాతో విజయం సాధించారు.
- మెదక్ లో భాజపా అభ్యర్థి రఘునందన్ రావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ నేత నీలం మధుపై 39,139 పైచీలుకు ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగురవేశారు.


## చరిత్ర తిరగరాసిన కాంగ్రెస్.. పదేళ్లలో తొలిసారి



**ఢిల్లీ :** కాంగ్రెస్ పనైపోయిందని అన్నారు. అదొక చచ్చిన పాములాంటిదని హేళన చేశారు. ఆ పార్టీ ఇంకెప్పుడూ కేంద్రంలో అధికారంలోకి రాదని.. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసలు 2024 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అస్థిత్వమే ఉండదని పేర్కొన్నారు. కానీ.. పడి లేచిన కెరటంలా కాంగ్రెస్ అనూహ్యంగా పునరాగమనం ఇచ్చింది. తన పని అయిపోలేదని, అసలు కథ మొదలైందంటూ భారీగా పుంజుకుంది. 'అబ్ కీ బార్ 400' అనే నినాదంతో బరిలోకి దిగిన బీజేపీకి దిమ్మతిరిగేలా షాకిచ్చింది. గత పదేళ్లుగా సాధ్యం కాని 100 సీట్ల మార్క్‌ని దాటేసి చరిత్ర తిరగరాసింది.

మంగళవారం జరుగుతున్న ఓట్ల లెక్కింపులో భాగంగా.. కాంగ్రెస్ ఈసారి 100 సీట్లు గెలుస్తుందని ఎలక్షన్ కమిషన్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. 2014 తర్వాత కాంగ్రెస్ ఈ రిమార్కబుల్ ఫీట్‌ని అందుకోవడం ఇదే మొదటిసారి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 464 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్.. కేవలం 44 సీట్లు మాత్రమే కైవసం చేసుకుంది. అనంతరం 2019 ఎన్నికల్లో 421 సీట్లలో పోటీ చేయగా.. 52 స్థానాల్లోనే నెగ్గింది. కానీ.. మల్లికార్జున అధ్యక్షతన కాంగ్రెస్ ఈసారి భారీగా పుంజుకుంది. ఏకంగా 100 స్థానాల్లో ఆధిక్యం సాధించింది. మల్లికార్జున ఖర్గే వేసిన రాజకీయ వ్యూహాలు, రాహుల్ గాంధీ చేసిన పాదయాత్ర కష్టమే.. ఈ ఫలితానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నైతికంగా మోడీ ఓడిపోయారు : ఖర్గే



**ఢిల్లీ :** ప్రస్తుత ఎన్నికల్లో మోడీకి వ్యతిరేక తీర్పు వచ్చిందని, నైతికంగా ఇది మోడీకి ఓటమి అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ, జై రాం రమేష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఏ ఒక్క పార్టీకి మెజార్టీ ఇవ్వలేదన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ పోరాటం చేసిందని, ప్రజాతీర్పును వినమ్రంగా స్వీకరిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఈ సారి లోక్ సభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదని, ఇండియా కూటమి ఐక్యంగా కలిసి పని చేసిందని అన్నారు. ఈ ఎన్నికల్లో మోడీతో పాటు గౌతమ్ అదానీ కూడా ఓడిపోయారన్నారు. ఎన్నికల్లో బీజేపీతో పాటు అనేక కేంద్ర దర్యాప్తు సంస్థలతో పోరాడామని చెప్పారు. ఏకంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని (కేజ్రీవాల్) జైల్లో పెట్టారని, దీంతో మోడీ, అమిత్ షాను దేశ ప్రజలు అందరూ తిర్కరించారన్నారు. బీజేపీ అధికారంలోకి ఉన్న పదేళ్లు మోడీ, అమిత్ షా కేంద్ర వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని కాపాడేందుకే మేం పోరాటం చేశామని స్పష్టం చేశారు. మాతో పాటు ప్రజలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడారని కొనియాడారు.

## కేరళలో విరిసిన కమలం.. స్టార్ నటుడు ఘన విజయం



**కేరళ :** దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. తొలిసారి కేరళ లోక్‌సభ నుంచి బీజేపీ గెలుపొందింది. బీజేపీ అభ్యర్థి, మలయాళ నటుడు సురేశ్ గోపీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో విజయాన్ని సాధించారు. తన సమీప ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి వీఎస్ సునీల్ కుమార్ పై దాదాపు 73వేలకు పైగా ఓట్ల మెజార్టీగాతో గెలుపొందారు.

అధిక శాతం విద్యావంతులు ఉన్న కేరళలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌ల మధ్య గట్టి పోటీ ఉంటుంది. ఇప్పటి వరకు కాంగ్రెస్ లేదంటే కమ్యూనిస్టులు గెలుస్తూ వస్తున్నారు. అయితే.. తొలి సారి లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు.

నటుడైన సురేశ్ గోపి రాజకీయ ప్రయాణం 2016లో మొదలైంది. ప్రముఖ పౌరుల కేటగిరీలో భారత రాష్ట్రపతి ఆయన్ను రాజసభ సభ్యుడిగా నామినేట్ చేశారు. అదే సంవత్సరం అక్టోబర్‌లో బీజేపీలో ఆయన చేరారు. పార్లమెంటు ఎగువ సభలో గోపి ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ సభ్యునిగా, పౌర విమానయాన సంప్రదింపుల కమిటీ సభ్యునిగా పనిచేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ పోటీ చేసి ఓడిపోయారు. ఆపై 2021 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయారు. అంతకు ముందు కేరళ లోక్‌సభ ఎన్నికల్లో 2,93,822 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు.

# హ్యాట్రిక్ ప్రధాని మోడీ

## గట్టీ పోటీతో దడ పుట్టించిన ఇండియా

**న్యూఢిల్లీ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సార్వత్రిక ఎన్నికల్లో మూడోసారి ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టించింది. బిజెపినేతలు ఆశించిన మెజార్టీ సంఖ్యాబలం లేకపోయినా అధికారం చేపట్టే మెజార్టీ స్థానాలను దక్కించుకుని ప్రధానిమోడీ మూడోసారి ప్రధాని పదవి చేపట్టేందుకు మార్గం సుగమమం చేసింది. మంగళవారం నిర్వహించిన ఓట్లలెక్కింపులో అధికార ఎన్డీయే కూటమికి 294 స్థానాలు రాగా ప్రతిపక్ష ఎన్డీయే కూటమికి 231 స్థానాలు దక్కాయి. స్వతంత్రులు ఇతరులుగా 18 మంది గెలిచారు. రాజ్యాంగాన్ని సవరించడం లేదా రద్దు చేసే కుట్రలు జరుగుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షణకు కూటమి కట్టుబడి ఉందని ఇండియా చేసిన ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లినా బిజెపి తన పదేళ్ల కాలంలో చేపట్టిన ప్రగతిని వివరిస్తూ విపక్ష కూటమి అవినీతి వ్యవహారాలను బయట పెడుతూ సాధ్యమైనంతగా ప్రజల్లోకి వెళ్లింది. ప్రధాని మోదీచేసిన విస్తృత స్థాయి ప్రచారం ఎన్డీయే కూటమికి కొంతమేర కలిసొచ్చింది. రిజర్వేషన్లను లాగేసుకుంటున్నదని, రిజర్వేషన్లపై పరిమితులు ఎత్తివేసి ఆ ఒబిసి రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తోందని కొంతవరకూ తన ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు బిజెపి ఎన్డీయే కూటమి రక్షించుకునే ప్రయత్నంచేసింది. ఎన్డీయేకూటమిలో ఇపుడు మెజార్టీ స్థానాల దిశగాచూస్తే బిజెపికి బీహార్ సీఎం నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలకం



కానున్నారు

ఎగ్జిట్ పోల్తో 300 స్థానాలు ఒక్క బిజెపికే వస్తాయని, ఎన్డీయేకు 400 స్థానాలకు పైగా వస్తాయన్న అంచనాలను తల్లకిందులు చేస్తూ ఫలితాల్లో ఇండియా కూటమికి 200కిపైగా సీట్లను తెచ్చిపెట్టారు దేశ ప్రజలు ప్రధానంగా హిందీ బెల్ట్ నే ఇండియా కూటమి బలపడుతోందని ఈ ఫలితాలు రుజువుచేసాయి. యుపి, గుజరాత్, మధ్య ప్రదేశ్‌బీ రాజస్థాన్, ఛత్తీస్ ఘర్‌బీ ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో బిజెపి తన హవాను కొనసాగించింది. యుపిలో అయితే ఈసారి ఇండియా కూటమి బిజెపి హవాకు బ్రేకులువేసింది. పశ్చిమబెంగాల్లో పాగా వేయాలని ప్రయత్నించినా ఆదిశగా ఫలి తాలు రాలేదు. తూర్పు రాష్ట్రం ఒడిశాలో మొట్ట మొదటిసారిగా బిజెపి పాలన పగ్గాలు చేపట్టడంతో కేంద్రంలో కూడా బిజెపికి కొంత మేలుచేస్తుందన్న భావన వ్యక్తం అవుతోంది. మొత్తం 543 స్థానాలకు ఎన్నికలు జరిగితే ఎన్డీయే కూటమికి 293స్థానాలు, ఇండియా కూటమికి 231 స్థానాలు దక్కాయి. మరో 19 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందడంతో ఇపుడు వీరు రెండు కూటములకు కీలకంగా మారుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో అయితే ఎన్డీయే మిత్రపక్షం కాబట్టే మెజార్టీ స్థానాలు ఈ కూటమికి దక్కినట్లే. అలాగే తెలంగాణలో పుంజుకోవాలని బిజెపి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎనిమిది స్థానాలు గెలుచుకుని బిజెపి తన బలాన్ని పెంచుకుని శక్తివంతంగా తయార యింది. ఎగ్జిట్ పోల్స్ తో ఎన్డీయే కూటమి ముఖ్యంగా బిజెపి కేడర్లో సంబరాలు పెరిగినా వాస్తవ ఫలితాలు వెల్లడి అయ్యాక కొంత నిరుత్సాహం కలిగింది. అయినా కూడా హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఎన్డీయే మూడోసారి పాలనపగ్గాలు చేపడుతుండటంతో బిజెపి శ్రేణుల్లో సంతోషాలు ఎగిసిపడుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల విజయం ఆధారంగానే ఇప్పటి వరకూ ఎన్డీయే అప్రతిహతంగా పాలనసాగించింది. ఈ సారి ఎన్డీయేకు ధీటుగా ఇండియా కూటమి కూడా వ్యూహాలు మార్చడంతో మెజార్టీ తగ్గింది. అయినా ఎన్డీయే మెజార్టీకి బ్రేకులు వేయగలిగిం దేకానీ ఇండియా కూటమి అధికారంలోకి వచ్చేంతగా మెజార్టీ మార్కును మాత్రం సాధించ లేకపోయింది. అందువల్లనే మళ్లీ మోడీ మూడోసారి ప్రధాని పదవిని చేపట్టేందుకు మార్గం ఏర్పడింది.

## రాహుల్ గాంధీ చేతిలో ఓటమిని అంగీకరించిన బీజేపీ అభ్యర్థి..

**రాయ్‌బరేలీ :** ప్రస్తుతం 2024 లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. బీజేపీ రాయ్‌బరేలీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్ మంగళవారం (జూన్ 4) కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేతిలో ఓటమిని అంగీకరించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టును పెట్టారు. రాయ్‌బరేలీ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. కాంగ్రెస్ కంచుకోట అయిన రాయ్‌బరేలిలో విజయం సాధించేందుకు తమ పార్టీ సభ్యులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నప్పటికీ.. 'నిర్ణయం మా చేతుల్లో లేదు' అని సింగ్ పేర్కొన్నారు.

తాజా ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం.. రాహుల్ గాంధీ 3,60,914 ఓట్లతో ముందంజలో ఉండగా, బీజేపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్ 1,59,870 ఓట్లతో వెనుకంజలో ఉన్నారు. ఫేస్‌బుక్‌లో పోస్ట్‌లో దినేష్ ప్రతాప్ సింగ్.. "నేను ఎంతో వినయంతో కష్టపడి రాయ్‌బరేలీ ప్రజలకు సేవ చేసాను. ప్రజాసేవలో నా ఆలోచనలు, మాటలలో లేదా చేతలలో ఏదైనా



పొరపాటు చేసి ఉన్నా లేదా ఎవరినైనా బాధపెట్టినట్లయితే నన్ను క్షమించండి" అంటూ తన ఓటమిని ముందుగానే అంగీకరించారు. వాస్తవానికి ఇంకా ఈ నియోజకవర్గంలో పూర్తి ఫలితం రాలేదు.

అదేవిధంగా, పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేసి ఎన్నికల్లో పోరాడిన శ్రేయోభిలాషులు, పార్టీ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కానీ, నిర్ణయం మా చేతుల్లో లేదన్నారు. ప్రజాకోర్టులో వారు ఏ ఆదేశాన్ని ఇచ్చినా ఎల్లప్పుడూ గౌరవంగా స్వీకరిస్తానని అన్నారాయన. ఎన్నికల్లో ఓడినప్పటికీ కూడా రాయ్‌బరేలీ నియోజకవర్గానికి నిరంతరం మద్దతు ఇస్తానని అక్కడి ప్రజలకు బీజేపీ అభ్యర్థి హామీ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఐదవ దశలో భాగంగా మే 20న రాయ్‌బరేలీ ఎన్నికలు జరిగాయి. రాయ్‌బరేలీ నియోజకవర్గం 2004 నుంచి 2024 వరకు సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. గాంధీ-నెహ్రూ కుటుంబానికి సాంప్రదాయంగా ఈ నియోజకవర్గం మారింది. గతంలో సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీలకు కూడా ఇదే నియోజకవర్గంలో సీటు దక్కింది.

## ఢిల్లీలో 'ఆప్', యూపీలో బీఎస్పీ ఖాళీ..



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో అధికారంలో ఉన్న 'ఆమ్ ఆద్మీ పార్టీ', ఉత్తరప్రదేశ్‌లో ఒకప్పుడు చక్రం తిప్పి, గత ఎన్నికల్లోనూ గట్టి ఉనికిని చాటుకున్న మాయావతి సారథ్యంలోని బీఎస్పీకి 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి.

**'ఆప్' హిస్టరీ రిపీట్..**

2019 ఎన్నికల్లో ఒక్క పార్లమెంటు స్థానం కూడా గెలుచుకోని 'ఆమ్ ఆద్మీ పార్టీ' ఈసారి (2024) కూడా ఎన్నికల్లోనూ ఖాతా తెరవకుండానే చతికిలపడింది. బీజేపీ మరోసారి ఢిల్లీలోని 7 లోక్‌సభ నియోజకవర్గాల్లో విజయకేతనం ఎగురవేసింది. కొద్దిలో కొద్దిగా ఊరట అన్నట్టుగా 'ఆప్' పంజాబ్‌లో ఒక సీటు గెలుచుకుంది.

**యూపీలో బీఎస్పీ ఉనికి కోల్పోయినట్టేనా?**

ఉత్తరప్రదేశ్‌కు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, దళిత పవర్‌హౌస్‌గా పేరున్న మాయావతి పార్టీ బీఎస్పీ ఈసారి ఖాతా తెరవకుండానే చతికిలపడింది. బీఎస్పీ మొత్తం 80 సీట్లలో పోటీ చేసినప్పటికీ ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవడం ఆ పార్టీని విస్తుపోయేలా చేసింది. 68 ఏళ్ల మాయావతి 1995, 1997, 2002, 2007లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఎంపీగా కూడా సేవలందించారు.

## పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ



**పశ్చిమ బెంగాల్:** నాలుగు వందల పైచిలుకు లోక్‌సభ స్థానాలు సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్డీయే పశ్చిమబెంగాల్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 41 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ 18 స్థానాల్లో విజయం సాధించింది. ఈ పర్యాయంలో 30 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించింది. మరోవైపు మమతా బెనర్జీ ఇండియా కూటమిలో చేరి ప్రచారం నిర్వహించారు.

ప్రస్తుతం వెలువడుతున్న ఎన్నికల ఫలితాల్లో బెంగాల్‌లో మమత పార్టీ స్పష్టమైన ఆధిక్యంలో దూసుకెళ్తోంది. తృణమూల్ కాంగ్రెస్ 31 స్థానాల్లో ఆధిక్యంలో దూసుకెళ్తోంది. మరోవైపు 30 స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ కేవలం 10 సీట్లకే పరిమితమైంది. ఓట్ల శాతంలో కూడా మమత పార్టీ భారీ ఆధిక్యంలో ఉంది. తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటివరకు 47 శాతం ఓట్లు సాధించి దూసుకెళ్తోంది. బీజేపీ 37 శాతం ఓట్లు, కాంగ్రెస్ 4.6 శాతం ఓట్లు సాధించాయి. 2019లో 22 లోక్‌సభ స్థానాలు దక్కించుకున్న మమత పార్టీ ఈసారి మరింత బలపడి 31 స్థానాలకు పెరిగింది.

## 2.8 లక్షల ఆధిక్యంతో కుమారస్వామి గెలుపు



**బెంగళూరు:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) నేత హెచ్‌డీ కుమారస్వామి మాండ్య లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణే గౌడపై 2.84 లక్షల భారీ ఆధిక్యంతో గెలిచారు. కుమారస్వామికి 8,51,881 ఓట్లు రాగా, గౌడకు 5,67,261 ఓట్లు పోలయ్యాయి. కర్ణాటకలోని 28 లోక్‌సభ స్థానాల్లో ఒక కీలక నియోజకవర్గంగా మాండ్య ఉంది. ఏప్రిల్ 26న రెండో దశ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మాండ్యలో పోలింగ్ జరిగింది.

## ఒడిశా విజయం.. 13 రాష్ట్రాల్లో అధికారంలో బీజేపీ

**ఒడిశా:** సార్వత్రిక ఎన్నికల్లో విజయంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు సిద్ధమైంది. లోక్ సభ ఎన్నికలతో పాటే నిర్వహించిన అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమలదళం జయకేతనం ఎగురవేసింది. దీంతో దేశంలో ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 13కు చేరుకుంది.

**బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు**

ఉత్తరాఖండ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, గోవా, అస్సాం, త్రిపుర, మణిపుర్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గఢ్ బీ అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా (తాజా ఎన్నికల్లో విజయం)

**ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామిగా ఉన్న రాష్ట్రాలు**

మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, బిహార్, పుదుచ్చేరి (శాసనసభతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం)బీ ఆంధ్రప్రదేశ్ (తెదేపా, జనసేన, బీజేపీ కూటమి)



**కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు**

హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ఝార్ఖండ్ జేఎంఎం ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉంది. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకేకు మిత్రపక్షంగా ఉన్నా.. ప్రభుత్వంలో చేరలేదు.

**కాంగ్రెస్, బీజేపీ యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు**

మిజోరం (జడ్పీఎం), పంజాబ్ (ఆప్), కేరళ (ఎల్డీఎఫ్), సిక్కిం (ఎస్కేఎం), పశ్చిమబెంగాల్ (టీఎంసీ), దిల్లీ (ఆప్) (శాసనసభతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం), జమ్మూ-కశ్మీర్ (రాష్ట్రపతి

# జాతీయ వార్తలు

## పోటీ చేసిన రెండుచోట్లా గెలిచిన రాహుల్ గాంధీ

- వయనాడ్‌లో సీపీఐ అభ్యర్థిపై 3.5 లక్షల మెజార్టీతో విజయం
- రాయ్‌బరేలీ నుంచి 3.7 లక్షల మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ నేత
- హసన్ నుంచి ఓడిపోయిన ప్రజ్వల్ రేవణ్ణ
- తిరువనంతపురంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్ విజయం



**వయనాడ్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తాను పోటీ చేసిన రెండు స్థానాలలో విజయం సాధించారు. కేరళలోని వయనాడ్ నుంచి రెండోసారి గెలిచారు. సమీప సీపీఐ అభ్యర్థి యానీ రాజాపై 3.5 లక్షల మెజార్టీతో గెలుపొందారు. ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి 3.7 లక్షల మెజార్టీతో గెలిచారు.

ఇక కర్ణాటకలోని హసన్ నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ ఓడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయాస్ ఎం అయ్యర్ చేతిలో 43వేల మెజార్టీతో ఓడిపోయారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి బీజేపీ అభ్యర్థి అన్నామలై రెండో స్థానంలో కొనసాగుతున్నారు. తిరువనంతపురంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్ విజయం సాధించారు. ఇక్కడి నుంచి శశిథరూర్ వరుసగా నాలుగోసారి గెలిచారు.

## మండిలో కంగనా రనౌత్ విజయం



- కంగనా రనౌత్ రాజకీయ అరంగేట్రంలోనే జయకేతనం
- హిమాచల్ ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి గెలుపు
- తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై 72,088 ఓట్ల మెజార్టీతో విజయం

**మండి:** బాలీవుడ్ నటి కంగనా రనౌత్ రాజకీయ అరంగేట్రంలోనే జయకేతనం ఎగురవేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి స్థానంలో బీజేపీ తరఫున పోటీ చేసిన కంగన తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్యసింగ్‌పై 72,088 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఏడో దశ ఎన్నికల్లో భాగంగా ఈ స్థానానికి జూన్ 1న పోలింగ్ జరిగింది. ఇక విలేకరుల సమావేశంలో రనౌత్ మాట్లాడుతూ.. "మేము ఈ ఎన్నికల్లో నరేంద్ర మోదీ పేరు మీద పోరాడాము. ఆయన విశ్వసనీయత, ఆయన హామీ, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసం ఫలితంగానే మేము మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాం" అని అన్నారు. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి అనురాగ్ ఠాకూర్ కూడా విజయం సాధించారు.

## ప్రభుత్వ ఏర్పాటు కోసం చంద్రబాబుతో మాట్లాడలేదు: శరద్ పవార్



- కూటమి ప్రభుత్వం ఏర్పాటు కోసం చంద్రబాబు, నితీశ్‌లతో పవార్ మాట్లాడినట్లుగా ప్రచారం
- వారితో తాను మాట్లాడలేదని స్పష్టం చేసిన శరద్ పవార్
- కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేదన్న పవార్

**ఢిల్లీ :** తాను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌తో మాట్లాడినట్లుగా జరిగిన ప్రచారాన్ని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కొట్టి పారేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమి 229 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో 272 మేజిక్ ఫిగర్ కోసం శరద్ పవార్... చంద్రబాబు, నితీశ్ కుమార్‌లతో మాట్లాడినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే పవార్ ఈ ప్రచారాన్ని కొట్టిపారేశారు. తాను ఎవరితోనూ మాట్లాడలేదన్నారు.

పవార్ ఇంకా మాట్లాడుతూ, కేంద్రంలో విపక్ష కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేదన్నారు. బుధవారం ఢిల్లీలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. మల్లికార్జున ఖర్గే, సీతారాం ఏచూరితో మాత్రమే తాను మాట్లాడానన్నారు. తదుపరి ప్రధానమంత్రి ఎవరు? అని మీడియా ప్రశ్నించగా, ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అనుకోవడం లేదన్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో వచ్చిన ఫలితాలు కూటమికి కొత్త మార్గనిర్దేశనం చేశాయన్నారు. మహారాష్ట్రలో బీజేపీ పలు స్థానాల్లో విజయం సాధించినప్పటికీ గతంతో పోలిస్తే సీట్లు తగ్గాయన్నారు. మహారాష్ట్రలో తమ పార్టీ పది చోట్ల పోటీ చేయగా ఏడు స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నామన్నారు.

## పవన్ గెలుపు.. వీర తిలకం పెట్టి హారతి ఇచ్చిన భార్య



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాయి. జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లో లీడింగ్ తో దూసుకెళు ంది. జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా పిఠాపురంలో భారీ మెజారిటీతో గెలిచారు. దీంతో పవన్ అభిమానులు, జనసేన కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

పవన్ నివాసం బయట అభిమానులు, కార్యకర్తలకు వచ్చి సెలబ్రేషన్స్ చేశారు. అభిమానులకు, జనసేన కార్యకర్తలకు పవన్, పవన్ భార్య అన్నా లేజనోవా, తనయుడు అకిరా నందన్ అభివాదం చేశారు. అనంతరం పవన్ గెలవడంతో భార్య అన్నా లేజనోవా పవన్ కళ్యాణ్ కి వీర తిలకం పెట్టి హారతి ఇచ్చింది. పక్కనే అకిరా నందన్ కూడా ఉన్నాడు. దీంతో ఈ వీడియో వైరల్ గా మారింది

## పవన్ తో చంద్రబాబు భేటీ.. ప్రభుత్వ ఏర్పాటుపై చర్చ



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల ఫలితాల్లో విస్పష్టమైన మెజారిటీ రావడంతో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వచ్చిన చంద్రబాబుకు పవన్ సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా భేటీ అయిన నేతలు.. ప్రభుత్వ ఏర్పాటు, సీఎం ప్రమాణస్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించినట్టు సమాచారం. ఎన్డీయే సమావేశానికి హాజరయ్యే అంశంపైనా ఇరువురు నేతలు సమాలోచనలు జరిపినట్టు తెలుస్తోంది.

## వైసీపీ గెలిచిన పది అసెంబ్లీ స్థానాలు ఇవే..!




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ అయింది. అధికార వైసీపీ గతంలో ఎన్నడూ లేనంత ఘోరంగా పరాజయం పాలైంది. కూటమి విజయం సాధించినా.. వైసీపీ గట్టి పోటీ ఇస్తుందని చాలా మంది విశ్వసించారు. కానీ... కనీస స్థాయిలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. మెత్తం పది అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. 1. పులివెందుల –వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2. పుంగనూరు – పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 3. బద్వేల్ – దాసరి సుధ 4. మంత్రాలయం – వై.బాలనాగిరెడ్డి 5. ఆలూరు – బూసినే విరూపాక్షి 6. యర్రగొండపాలెం – తాటిపర్తి చంద్రశేఖర్ 7. అరకు – రేగం మత్స్యలింగం 8. పాడేరు – మత్స్యరాస విశ్వేశ్వరరాజు 9. రాజంపేట – ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి 10. తంబళ్లపల్లి – పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి.

## కమలాపురంలో సీఎం జగన్ మేనమామ ఓటమి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పోటీ చేసిన ప్రతి జిల్లాలోనూ టీడీపీ అభ్యర్థుల హవా స్పష్టంగా కనిపించింది. టీడీపీ సునామీలో సీఎం జగన్ మేనమామ పి.రవీంద్రనాథ్ రెడ్డి కూడా గల్లంతయ్యారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆయన ఓటమి పాలయ్యారు. కమలాపురం టీడీపీ అభ్యర్థి పి.కృష్ణచైతన్య రెడ్డి తిరుగులేని విజయం అందుకున్నారు.

17 రౌండ్ల అనంతరం కృష్ణచైతన్య రెడ్డి 23,063 ఓట్ల మెజారిటీతో ఉన్నారు. 17 రౌండ్లలో టీడీపీ అభ్యర్థి కృష్ణచైతన్య రెడ్డికి 88,853 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి రవీంద్రనాథ్ రెడ్డికి 65,790 ఓట్లు వచ్చాయి.

# ఒకే ఒక్కడు.. సునామీకి ఎదురీదిన పెద్దిరెడ్డి!



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో ఓటర్లు సృష్టించిన సునామీలో వైసీపీ నాయకులు, ఉద్ధండ నేతలు కూడా.. కొట్టుకుపోయారు. మంత్రి బొత్స సత్యనారా యణ కుటుంబ సమేతంగా మెత్తం మట్టికరిచారు. టీడీపీ కూటమి ప్రభంజనానికి చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్టుగా మంత్రులు ఘోర పరాజయం పాలయ్యారు. ఎవరూ మిగలరా? అన్నట్టుగా సృష్టించిన ఈ సునామీలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి బూడి ముత్యాలనాయకుడు, ఆదిమూలపు సురేష్, తానేటి వనిత, ఉష శ్రీచరణ్, విడదల రజనీ, పినిపే విశ్వరూప్, చెల్లుబోయి న వేణు.. ఇలా ఉన్న మంత్రులు అందరూ కూటమికి అనుకూలంగా ప్రజలు కురిపించిన ఓట్ల వర్షానికి గల్లంతయ్యారు.

అయితే.. ఇంత సునామీలోనూ..వైసీపీ అధినేత జగన్ విజయం దక్కించుకున్నారు. ఆయనతోపాటు.. ఓడి గెలిచిన చందంగా .. అతి కష్టం మీద పుంగనూరు నుంచి మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక్కరు మాత్రమే విజయం దక్కించుకున్నారు. ఇక్కడ బలమైన పోటీ ఏర్పడింది. ప్రతి రౌండ్‌లోనూ మెజారిటీ మారిపోయింది. ఒకానొక దశలో పెద్దిరెడ్డి కూడా ఓటమి అంచుల్లోకి వెళ్లిపోయారు. బోడే రామచంద్రయాదవ్ బీసీవై తరఫున బలమైన పోటీ ఇచ్చారు. ఇక, టీడీపీ నేత.. చల్లా రామచంద్రారెడ్డి కూడా.. నువ్వా.. నేనా అన్నట్టుగా పోరాటం చేశారు

మొత్తంగా మంగళవారం ఉదయం నుంచి హోరా హోరీగా సాగిన పుంగనూరు ఫైట్‌లో పెద్దిరెడ్డి విజయం దక్కించుకున్నారు. ఈయనకు నిజానికి బలమైన కోటరీ ఉంది. అయినా.. కూడా.. ఈ సారి పెద్ద ఎత్తున పోటీ ఏర్పడింది. ఇక్కడ పెద్దిరెడ్డిని ఓడించేందుకు పలు శక్తులు చేతులు కలిపాయి. అయినప్పటికీ.. వాటిని ఛేదించుకుని.. చివరి రెండు మూడు రౌండ్లలో ఆధిక్యతను ప్రదర్శించారు. 6538 ఓట్ల మెజారిటీతో బతుకు జీవుడా అనుకుంటూ.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విజయం దక్కించుకున్నారు. మొత్తంగా జగన్ కేబినెట్‌లోని మంత్రుల్లో పెద్ది రెడ్డి ఒక్కరే విజయం దక్కించుకోవడం గమనార్హం.

## ఏపీలో ఓడిపోయిన కీలక నేతలు వీరే.. ఎనిమిది జిల్లాల్లో వైసీపీకి జీరో..





**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టించింది. దీంతో వైసీపీ ఎనిమిది జిల్లాల్లో కనీసం ఖాతా తెరవలేదు. గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన విజయనగరం, నెల్లూరు జిల్లాల్లోనూ వైసీపీ ఈ సారి ఒక్క సీటూ గెలుచుకోకపోవడం గమనార్హం. ఏపీలోని వైసీపీ ముఖ్య నేతలు సైతం ఓడిపోయారు.

**ఓడిపోయిన కీలక నేతలు వీరే**

బుగ్గన రాజేంద్రనాథ్ (వైసీపీ)
డోన్ , వంగా గీత (వైసీపీ)
పిఠాపురం, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (వైసీపీ)
మాచర్ల , అంబటి రాంబాబు (వైసీపీ)
సత్తెనపల్లి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి (వైసీపీ)
రాప్తాడు,కారుమూరి నాగేశ్వర రావు (వైసీపీ)
తణుకు, కొట్టు సత్యనారాయణ (వైసీపీ)
తాడేపల్లిగూడెం, రవీంద్రనాథ్ (వైసీపీ)
కమలాపురం, తానేటి వనిత (వైసీపీ)
గోపాలపురం, అంజాద్ బాషా (వైసీపీ)కడప, ఆళ్ల నాని (వైసీపీ) ఏలూరు, జక్కంపూడి రాజా (వైసీపీ)రాజానగరం, కోన రఘుపతి (వైసీపీ) బాపట్ల, కొడాలి నాని (వైసీపీ)గుడివాడ, వల్లభనేని వంశీ (వైసీపీ)గన్నవరం, గుడివాడ అమర్‌నాథ్ (వైసీపీ), గాజువాక, చెల్లుబోయిన వేణుగోపాల్ (వైసీపీ)రాజమండ్రి రూరల్, బొత్స సత్యనారాయణ (వైసీపీ)చీపురుపల్లి, మార్గాని భరత్ (వైసీపీ), రాజమండ్రి సిటీ, ఆర్కే రోజా (వైసీపీ)నగరి,

**ఈ 8 జిల్లాల్లో జీరో...**

కృష్ణా, గుంటూరు,తూర్పు గోదావరి, విజయనగరం,శ్రీకాకుళం,నెల్లూరు,పశ్చి గోదావరి,ప్రకాశం.

# జగన్ ఘోర ఓటమిలో షర్మిల కీలక పాత్ర



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అప్పుడు అన్న వదిలిన బాణం. ఇప్పుడు అన్నకే గుచ్చుకున్న బాణం. కనిపించిన శత్రువు, కనిపించకుండా చేసిన గాయంవైసీపీని సలుపుతోంది. జగన్ ఓటమిలో చెల్లి షర్మిల పాత్ర ఎంత? కాంగ్రెస్‌ని గెలిపించలేకపోయినా, వైసీపీని ఓడించడంలో షర్మిల కీలక పాత్ర పోషించారా? ఆమె ఒకప్పుడు అన్న వదిలిన బాణం. 2014లో జగన్ కోసం, వైసీపీ కోసం.వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారు షర్మిల. ఆ తర్వాత 2019లో కూడా అన్న కోసం మరోసారి కొంగు బిగించి ఎన్నికల రణరంగంలోకి దూకారు. ఆ తర్వాత జగన్‌తో షర్మిలకు గ్యాప్ వచ్చింది. ఇద్దరి దారులు వేరయ్యాయి. రాజకీయ లక్ష్యాలు, గమ్యాల్లో కూడా తేడా వచ్చింది.ఆ తర్వాత తెలంగాణలో వైఎస్సార్‌టీపీ అనే పార్టీ పెట్టిన షర్మిలమరోసారి పాదయాత్ర చేశారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కంటే కొద్దిగా ముందుగానే అక్కడ కొట్టు కట్టేశారు షర్మిల. కాంగ్రెస్ కండువా కప్పేసుకు న్నారు. ఆ తర్వాత ఏపీ పీసీసీ చీఫ్‌గా పగ్గాలు చేపట్టిన షర్మిలఏకంగా అన్న జగన్ పైనే విమర్శల బాణాలు సంధించడం మొదలు పెట్టారు. జగన్‌కు కంట్లో నలుసుగా మారారు. ఇంటి వ్యక్తి శత్రువుగా మారితేఆ బాధలు ఇంతింత కాదయా అనే లెవెల్లో జగన్‌ను ఇబ్బందులు పెట్టారు. అన్న వదిలిన బాణంచివరకు అన్నకే గుచ్చుకుంది.

ఏపీలో కాంగ్రెస్‌కు 2 శాతం కంటే కాస్త తక్కువగా ఓట్లు వచ్చినా, చాలా చోట్ల వైసీపీని ఇబ్బంది పెట్టగలిగారు షర్మిల. మరీ ముఖ్యంగా ఎస్సీలు, ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉండే చోట్ల షర్మిల ఫ్యాక్టర్ పని చేసిందని చెబుతున్నారు. గుంటూరు ఈస్ట్ లాంటి చోట్ల కాంగ్రెస్‌కు మైనారిటీల ఓట్లు బాగానే పడ్డాయనే అంచనా ఉంది. ఇక రాయలసీమలో మరీ ముఖ్యంగా కడపలో షర్మిల వల్ల వైసీపీ బాగా నష్టపోయిందనేది విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్‌ని గెలిపించలేకపోయినా, వైసీపీ ఓటమికి షర్మిల కూడా ఓ కారణం అయ్యారని నిపుణులు చెబుతున్నారు.

# వైసీపీ వారసులంతా ఓటమే

అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం– జనసేన– బీజేపీ కూటమి హవా కొనసాగిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మేజిగ్ ఫిగర్‌ను దాటి అత్యధిక సీట్లను కైవసం చేసుకుంది. ఇక ఈ ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీకి ఘోర పరాభవం తప్పలేదు. గత ఎన్నికల్లో ‘ఒక్క ఛాన్స్ ఇవ్వండి..’, ‘మాట తప్పను.. మడమ తిప్పను’ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు..

**మార్చిన అభ్యర్థులంతా ఓటమే..** ఇక ఈ సారి కూడా రాష్ట్రంలో అధికారంలోకి రావాలని జగన్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. అందుకు అనుగుణంగా పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులను కూడా మార్చారు. అయినా ఫలితం లేకపోయింది. మార్చిన అందరు అభ్యర్థులూ ఓడిపోయారు. దీంతో ఎన్నికలకు ముందు ‘వై నాట్ 175’ అన్న వైసీపీ నేతలు ఇప్పుడు ఎన్నికల ఫలితాలు చూసి ఒక్కసారిగా ఖంగుతింటున్నారు. ఇక వైసీపీ నేతల వారసులు అంతా ఓడిపోవడం గమనార్హం. వారితోపాటు పలువురు మంత్రులు, కీలక నేతలు సైతం ఓటమిపాలయ్యారు.

**వైసీపీ నేతల వారసుల ఓటమి..** ఈ సారి పలువురు వైసీపీ సీనియర్ నేతలు తమకు బదులు తమ వారసులకు సీట్లు ఇప్పించుకుని ఎన్నికల బరిలోకి దింపారు. అయితే, ఒక్కరు కూడా గెలవలేదు. వీరిలో.. తిరుపతిలో భూమన కుమారుడు అభినయ రెడ్డి, చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి, బందర్‌లో పేర్నినాని కుమారుడు పేర్ని కృష్ణమూర్తి, జీడీ నెల్లూరులో నారాయణస్వామి కూతురు కృపాలక్ష్మి ఉన్నారు. వీరంతా కూడా ఓటమిపాలయ్యారు.

**పెద్ది రెడ్డిమినహా మంత్రులంతా ఓటమి..** బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, బుగ్గన రాజేంద్రనాథ్, అంజాద్ బాషా, ఉషశ్రీ చరణ్, రాజన్న దొర, కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, ఆర్కే రోజా, కాకాణి గోవర్ధన్ రెడ్డి, దాడిశెట్టి రాజా, అంబటి రాంబాబు, విడదల రజిని, తానేటి వనిత, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, చెల్లబోయిన వేణు, జోగి రమేశ్, ఆర్కే రోజా సహా పలువురు మంత్రులు, కీలక నేతలు ఇప్పటికే ఓడిపోయారు.

## హిందూపురంలో బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం



హిందూపురం (జర్నలిస్ట్ ఫైల్) హిందూపురంలో సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి టీఎన్ దీపికపై ఆయన 31,602 ఓట్లతో గెలుపొందారు. ఇది ఆయనకు హ్యాట్రిక్ విజయం. ఎన్టీ రామారావు రాజకీయాల్లో ఉన్నప్పటి నుంచే కంచుకోటగా ఉన్న హిందూపురంలో.. బాలకృష్ణ 2014 నుంచి విజయం సాధిస్తూ వస్తున్నారు. 2014లో 81,543 ఓట్ల మెజార్టీతో విజయఢంకా మోగించిన ఆయన.. 2019లో 91,704 వేల ఓట్ల మెజార్టీతో అఖండ విజయాన్ని నమోదు చేశారు.

## ‘ఏపీ తీర్పు అపూర్వం’ - ప్రధాని మోదీ ధన్యవాదాలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్డీఏకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు అపూర్వ విజయం అందించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఘన విజయం సాధించినందుకు గాను చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ తోపాటు తెదేపా, జనసేన, భాజపా కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. ఏపీ సర్వతోముఖాభివృద్ధితోపాటు రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ ట్వీట్ చేశారు.

వరుసగా మూడోసారి ఎన్డీఏ కూటమిపై దేశ ప్రజలు విశ్వాసాన్ని ఉంచారని.. ఇదో చారిత్రక ఘట్టమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజల అభిమానానికి ధన్యవాదాలు తెలిపిన ఆయన.. వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు గడిచిన దశాబ్ది కాలంగా చేస్తున్న మంచి పనులను కొనసాగిస్తామన్నారు. ఈ విజయానికి కృషి చేసిన కార్యకర్తలందరికీ నమస్కరిస్తున్నానని అన్నారు. మరోవైపు, ఒడిశా ప్రజలు కూడా అద్భుత విజయాన్ని అందించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమ సుపరిపాలనకు ఇది అఖండ విజయమన్నారు. రాష్ట్ర ప్రజల కలలను నెరవేర్చేందుకు ఏ అవకాశాన్నీ భాజపా వదులుకోదని.. అభివృద్ధిలో ఒడిశాను కొత్త శిఖరాలకు తీసుకువెళ్తామన్నారు.


## జగన్ రాజీనామాఆమోదం

- **సీఎం పదవికి రాజీనామా చేసిన జగన్**
- **కొత్త ప్రభుత్వం ఏర్పాటు వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలన్న గవర్నర్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి నేపథ్యంలో, ముఖ్యమంత్రి పదవికి జగన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ సాయంత్రం ఆయన తన రాజీనామా పత్రాన్ని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు పంపారు. తాజాగా, జగన్ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. అయితే, నూతన ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ సీఎంగా ఉండాలని జగన్ ను గవర్నర్ కోరారు. గత ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలు, 22 ఎంపీ స్థానాలతో ఎంతో గొప్పగా గెలిచిన వైసీపీ... 2024 ఎన్నికల్లో పాతాళానికి పడిపోయింది. కేవలం 11 అసెంబ్లీ స్థానాలు, 4 ఎంపీ స్థానాలతో సరిపెట్టుకుంది.

ఈ ఎన్నికల్లో టీడీపీ 135 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించగా, జనసేన 21 స్థానాలతో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. వైసీపీ 11 సీట్లతో మూడో స్థానంలో ఉంది. బీజేపీకి 8 స్థానాలు లభించాయి.


## రఘురామకృష్ణరాజు ఘన విజయం



- **ఉండి నియోజకవర్గం నుంచి గెలుపొందిన టీడీపీ అభ్యర్థి ఆర్ఆర్ఆర్**
- **వైసీపీ అభ్యర్థి వెంకట లక్ష్మీ నరసింహరాజుపై 56,777 ఓట్ల భారీ**
- **మెజారిటీవైసీపీ అభ్యర్థికి 60,125 ఓట్లు రాగా, ఆర్ఆర్ఆర్‌కు 1,16,902 ఓట్లు**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రఘురామకృష్ణరాజు విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి వెంకట లక్ష్మీ నరసింహరాజుపై 56,777 ఓట్ల భారీ మెజారిటీతో విజయదుందుభి మోగించారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థికి 60,125 ఓట్లు రాగా, ఆర్ఆర్ఆర్‌కు 1,16,902 ఓట్లు వచ్చాయి

## పవన్ పవర్ ఫుల్ విక్టరీ



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టించింది. అన్ని ప్రాంతాల్లోనూ క్లీన్ స్వీప్‌చేసింది. పిఠాపురం నుంచి బరిలో నిలిచిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి వంగా గీతపై 69,169 ఓట్ల తేడాతో రికార్డు విజయం నెలకొల్పారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి విజయం సాధించారు.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467